# జర్నలిస్ట్ డైరీ
తెలుగు దినపత్రిక



సంపుటి :13 సంచిక :3 సోమవారం 7-9-2026 పేజీలు:8 వెల:3 https://www.epaperjournalistdiary.com/


# నేటి నుంచి అసెంబ్లీ


## ఉదయం 10 గంటలకు ఉభయ సభల ప్రారంభం

- తొలుత ప్రశ్నోత్తరాలు.. ఆ తర్వాత కీలక నివేదికలు
- పీఎం శ్రీ, సమగ్ర శిక్ష వార్షిక నివేదికలు ప్రవేశపెట్టనున్న సీఎం
- హైదరాబాద్ మెట్రో రైల్ నివేదికలకూ సభలో చోటు
- సభ ఎన్నిరోజులు నిర్వహించాలనేది నేడు బీఏసీ భేటీలో నిర్ణయం
- ఈ నెల 11 వరకే సమావేశాలు కొనసాగే అవకాశం
- వరుస సెలవులతో ముందుగానే ముగించే యోచన
- మాజీ ఎమ్మెల్యేలకు సంతాపం తెలిపే అంశంపై ఉత్కంఠ
- సీడబ్ల్యూసీ భేటీకి సీఎం హాజరవుతారా?
- తెలంగాణ--ఏపీ నదీజలాల అంశాలపై చర్చకు అవకాశం
- ఒకే ప్రాంగణంలో శాసనసభ, మండలి
- 24 ఏళ్ల తర్వాత జూబ్లీహాల్‌కు వీడ్కోలు
- పార్లమెంట్ తరహాలో సెంట్రల్ హాల్ ఏర్పాటు
- మీడియా అనుమతిపై కొనసాగుతున్న సందిగ్ధత

**తెలంగాణ అసెంబ్లీ వర్షాకాల సమావేశాలు సోమవారం ఉదయం 10 గంటలకు ప్రారంభం కానున్నాయి. శాసనసభ, శాసనమండలి తొలిసారిగా ఒకే ప్రాంగణంలో కొలువుదీరనున్న ఈ సమావేశాల్లో ప్రశ్నోత్తరాల అనంతరం సీఎం రేవంత్‌రెడ్డి తెలంగాణ సమగ్ర శిక్ష, పీఎం శ్రీ పథకాలతోపాటు హైదరాబాద్ మెట్రో రైల్ ప్రాజెక్టుకు సంబంధించిన వార్షిక నివేదికలను సభలో ప్రవేశపెట్టనున్నారు. అనంతరం బీఏసీ సమావేశమై సభ నిర్వహణ రోజులపై నిర్ణయం తీసుకోనుంది. మూడు రోజుల వరుస సెలవుల నేపథ్యంలో ఈ నెల 11 వరకే సమావేశాలు జరిగే అవకాశం ఉంది.**

హైదరాబాద్
రాష్ట్ర అసెంబ్లీ సమావేశాలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఉదయం 10 గంటలకు చైర్మెన్ గుత్తా సుఖేందర్ రెడ్డి అధ్యక్షతన శాసనమండలి, స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ అధ్యక్షతన శాసనసభ ఆరంభం కాను న్నాయి. ఉభయ సభల్లో తొలుత ప్రశ్నోత్తరాలను చేపట్టనున్నారు. అనంతరం సీఎం రేవంత్ రెడ్డి... తెలంగాణ సమగ్ర శిక్ష (టీ.ఎస్.ఎస్), పీఎం శ్రీ పథకంతోపాటు హైదరాబాద్ మెట్రో రైల్ ప్రాజెక్టు సంబంధించి 2013 ఆర్థిక సంవత్సరం నుంచి 2018 వరకు వార్షిక నివేదికను సభలో ప్రవేశపెట్టనున్నారు.

-మిగతా 2 లో





## యూట్యూబ్ చూసి అవకాడో సాగుపై అవగాహన..

- కడప జిల్లా రైతు కర్వ వరదరాజ్‌పై 'మన్ కీ బాత్' కార్యక్రమంలో ప్రధాని ప్రశంసలు
- ప్రధాని మోదీ మెచ్చిన కడప రైతు...
- పులివెందుల యువ రైతు కర్వ వరదరాజ్

**కడప, ఏపీ బ్యూరో, జర్నలిస్ట్ డైరీ :**
యూట్యూబ్ చూసి అవకాడో సాగుపై అవగాహన పెంచుకున్న పులివెందుల యువ రైతు
టమాటా, అరటిలో నష్టాలు రావడంతో ప్రత్యామ్నాయ పంటగా అవకాడోను ఎంచుకున్న వైనం
నాలుగేళ్ల క్రితం నాటిన మొక్కలు.. ఇప్పటివరకు నాలుగు టన్నుల దిగుబడి
ప్రధాని ప్రస్తావనతో తనకు, తన గ్రామానికి గొప్ప గుర్తింపు లభించిందంటూ హర్షం
సాధారణంగా కరవు ప్రాంతంగా, పరిమిత పంటలకే అనుకూలంగా ఉండే కడప జిల్లా పులివెందుల నుంచి ఓ యువ రైతు దేశవ్యాప్తంగా వార్తల్లో నిలిచారు. ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకుని, వినూత్న పంటను సాగు చేసి ఆయన సాధించిన విజయాన్ని స్వయంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రశంసించారు. ఇటీవల ప్రసారమైన 137వ 'మన్ కీ బాత్' కార్యక్రమంలో ప్రధాని ఈ రైతు విజయగాథను ప్రత్యేకంగా ప్రస్తావించారు. దీంతో కడప జిల్లాకు చెందిన 30 ఏళ్ల కర్వ వరదరాజ్ ఇప్పుడు అందరి దృష్టిని ఆకర్షిస్తున్నారు. వివరాల్లోకి వెళితే.. పులివెందులకు చెందిన వరదరాజ్ తన తల్లి, భార్య ప్రమీల, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడితో కలిసి వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్నారు. 2022 వరకు ఆయన కుటుంబం సంప్రదాయబద్ధంగా టమాటా, అరటి పంటలను సాగు చేసేది. అయితే ఆ ఏడాది పంట సరిగా పండకపోవడం, మార్కెట్లో ధరలు పడిపోవడంతో తీవ్రంగా నష్టపోయారు. ఈ అనుభవం ఆయన్ను కొత్త పంటల వైపు ఆలోచించేలా చేసింది. ఈ క్రమంలోనే ఆయన యూట్యూబ్ ద్వారా అవకాడో సాగు గురించి తెలుసుకున్నారు. మరింత శాస్త్రీయ పరిజ్ఞానం కోసం కర్ణాటక వెళ్లి అక్కడి వ్యవసాయ క్షేత్రాలను సందర్శించారు.-మిగతా 2 లో



02

## కొత్త ప్రపంచ పటంపై భారత్ అభ్యంతరం

- జమ్మూకశ్మీర్, లద్దాఖ్‌ను అధికారిక పటం ప్రకారమే చూపాలి
- ఐరాస ప్రతిపాదనపై విదేశాంగ శాఖ స్పష్టీకరణ
- సరిహద్దులు, వివాదాస్పద ప్రాంతాలపై నిర్ణయాలేవీ లేవు
- దేశాల వాస్తవ భూభాగ వైశాల్యాన్ని చూపడమే లక్ష్యం
- భారత భూభాగాన్ని తప్పుగా చూపించే అవకాశం ఉందని ఆందోళన
- సార్వభౌమాధికారం, ప్రాదేశిక సమగ్రతపై భారత్ స్పష్టమైన వైఖరి
- భూభాగ వైశాల్యం ఆధారంగా రూపొందించే పటానికి భారత్ మద్దతు



02

## అమెరికాలోనూ 'సర్'..

- ఓటర్ల జాబితాల సమీక్షకు ట్రంప్ సర్కారు సిద్ధం
- 10 లక్షల మంది భారత సంతతి ఓటర్లపై తొలగింపు ముప్పు?
- ఓటర్ల జాబితాల సమగ్ర పరిశీలనకు రూ.125 కోట్ల నిధులు
- నవంబర్ మధ్యంతర ఎన్నికల్లోపు ప్రక్రియ పూర్తి చేయాలని లక్ష్యం
- బాధ్యతను ఇమ్మిగ్రేషన్, కస్టమ్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ (ఐసీఈ)కి అప్పగించిన ట్రంప్
- 50 రాష్ట్రాల్లో ఓటర్ల జాబితాల పరిశీలన, నవీకరణ
- ప్రభుత్వ రికార్డులతో ఓటర్ల సమాచారాన్ని సరిపోల్చనున్న కంప్యూటర్లు
- వివరాల్లో తేడాలుంటే పునఃపరిశీలన.. తొలగింపునకు అవకాశం

## మూడేళ్లలో డ్రగ్స్ రహిత భారత్

- 2029 నాటికి మాదకద్రవ్య రహిత భారత్ లక్ష్యం
- నాలుగు స్థాయిల్లో నార్కో సమన్వయ కేంద్రాలు
- రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో ప్రత్యేక టాస్క్‌ఫోర్స్‌లు
- ఎన్‌సీబీ పునర్వ్యవస్థీకరణ.. నిదాన్ పోర్టల్‌తో జాతీయ డేటాబేస్
- చిన్న ప్యాకెట్ పట్టుబడినా మొత్తం నెట్‌వర్క్ వెలికితీత
- 2029 మార్చి నాటికి 100 జాతీయ, అంతర్జాతీయ నెట్‌వర్క్‌ల ధ్వంసం
- 36 దేశాల నుంచి 274 మంది నేరస్థులను భారత్‌కు తీసుకొచ్చాం
- నక్సలిజం తరహాలో డ్రగ్స్ ముప్పును అంతం చేస్తాం: అమిత్ షా



02

## మెట్రో రంగంలో భారత్ మరో మైలురాయి

- రెండేళ్లలో అమెరికాను దాటనున్న భారత్
- చైనా తర్వాత రెండో స్థానంపై కన్ను
- 26 నగరాలకు విస్తరించిన మెట్రో సేవలు
- 1,170 కిలోమీటర్లకు చేరిన మెట్రో నెట్‌వర్క్
- 12 ఏళ్లలో ఐదు రెట్లు పెరిగిన నెట్‌వర్క్
- కొత్త ప్రాజెక్టులతో మరింత వేగంగా విస్తరణ
- ప్రపంచంలో మూడో స్థానంలో భారత్
- నిర్మాణంలో ఉన్న మార్గాలతో పెరగనున్న నెట్‌వర్క్



02

# జల యుద్ధానికి సిద్ధం కండి

కాళేశ్వరం, పాలమూరు ప్రాజెక్టులపై సర్కార్‌ను నిలదీయండి



- సాగునీటి సమస్యలపై అసెంబ్లీని స్తంభింపజేయండి
- లక్షల మందితో ప్రత్యక్ష కార్యాచరణ రూపొందిస్తాం
- 22ఏ భూములు, నిరుద్యోగం, ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై ప్రశ్నించాలి
- ఎర్రవెల్లిలో బీఆర్ఎస్ఎల్పీ సమావేశంలో కేసీఆర్

**అసెంబ్లీ సమావేశాల వేళ బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ 'జలయుద్ధం'కు పిలుపునిచ్చారు. కాళేశ్వరం, పాలమూరు--రంగారెడ్డి ప్రాజెక్టులతోపాటు సాగునీరు, తాగునీటి సమస్యలపై కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఉభయ సభల్లో నిలదీయాలని పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు దిశానిర్దేశం చేశారు. సాగునీటి అంశంపై అసెంబ్లీని స్తంభింపజేయడంతోపాటు 22ఏ భూములు, నిరుద్యోగం, ఫీజు రీయింబర్స్‌మెంట్, ఉచిత విద్యుత్, ఉద్యోగుల సమస్యలు తదితర అంశాలపై ప్రభుత్వాన్ని ఎండగట్టాలని సూచించారు. త్వరలో లక్షలాది మందితో ప్రత్యక్ష కార్యాచరణ చేపడతామని కేసీఆర్ ప్రకటించారు.**

హైదరాబాద్,
తెలంగాణకు సాగునీటి విషయంలో జరుగుతున్న అన్యాయంపై కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిలదీసేందుకు 'జలయుద్ధం'కు సిద్ధం కావాలని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు పిలుపునిచ్చారు. సోమవారం నుంచి అసెంబ్లీ సమావేశాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో ఆదివారం ఎర్రవెల్లిలో శాసనసభ్యులతో సమావేశమైన ఆయన... కాళేశ్వరం, పాలమూరురంగారెడ్డి ప్రాజెక్టులతో పాటు సాగునీరు, తాగునీటి సమస్యలపై ఉభయ సభల్లో ప్రభుత్వాన్ని గట్టిగా ప్రశ్నించాలని సూచించారు. కాళేశ్వరంపై కాంగ్రెస్ చేస్తున్నవన్నీ దుష్ప్రచారాలేనని, కుట్రపూరితంగా నీటిని ఎత్తిపోసే-మిగతా 2 లో



02

## ఇజ్రాయిల్‌పై భారీ దాడికి ఇరాన్ వ్యూహం

- హిజ్బుల్లా, హమాస్, హూతీలతో సమన్వయం
- అన్ని వైపుల నుంచి ఏకకాలంలో దాడికి ప్లాన్
- 2023 దాడి కంటే తీవ్రంగా ఉండొచ్చని హెచ్చరిక
- ఇరాన్--హమాస్ మధ్య బలపడుతున్న సంబంధాలు
- ఇజ్రాయిల్‌పై ప్రతీకారానికి ప్రత్యేక బృందాలు
- మిత్రదేశాల కమాండర్లతో ఐఆర్‌జీసీ చర్చలు
- క్షిపణులు, డ్రోన్ల ఉత్పత్తికి మరింత వేగం
- అణు సామర్థ్యాల పునరుద్ధరణపై ఇరాన్ దృష్టి



## ఉద్యోగుల ఆరోగ్య భద్రతే ప్రభుత్వ లక్ష్యం

- ఈహెచ్‌ఎస్ అమల్లో రాజీ లేదు : భట్టి
- ఉద్యోగుల ఆరోగ్యమే ప్రభుత్వ తొలి ప్రాధాన్యం
- ఆరోగ్య కార్డుల జారీని వేగవంతం చేయాలి
- 354 ప్రైవేటు ఆస్పత్రుల్లో ఈహెచ్‌ఎస్ సేవలు
- మరిన్ని ఆస్పత్రులను చేర్చేందుకు చర్యలు
- ఉద్యోగ సంఘాల సూచనలతో పథకం రూపకల్పన
- దశాబ్దాల సమస్యకు మానవీయ పరిష్కారం
- పథకం అమలుపై అధికారులు ప్రత్యేక శ్రద్ధ
- ఉద్యోగులు, కుటుంబాల ఆరోగ్య భద్రతకు భరోసా
- ఈహెచ్‌ఎస్ విజయవంతం చేయడం అందరి బాధ్యత

హైదరాబాద్
ఇందిరమ్మ ప్రజాప్రభుత్వం ఉద్యోగుల సంక్షేమం పట్ల ఎంతో పూర్తి నిబద్ధతతో పనిచేస్తోందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క చెప్పారు. ఉద్యోగుల సంక్షేమం, హక్కుల పరిరక్షణకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని వివరించారు. ఉద్యోగుల ఆరోగ్య భద్రతే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. ఆదివారం హైదరాబాద్‌లోని మహాత్మా జోతిబాపూలే ప్రజాభవన్‌లో ఎంప్లాయిస్ హెల్త్ స్కీమ్ ట్రస్ట్ బోర్డు (ఈహెచ్‌సీటీ) సభ్యులు, ఉన్నతాధికారులతో ఉప ముఖ్యమంత్రి భట్టి ఉన్నతస్థాయి సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగులు, వారి

-మిగతా 2 లో

## ఇజ్రాయిల్‌పై భారీ దాడికి ఇరాన్ వ్యూహం



**-హిజ్బుల్లా, హమాస్, హూతీలతో సమన్వయం**
**-అన్ని వైపుల నుంచి ఏకకాలంలో దాడికి ప్లాన్**
**-2023 దాడి కంటే తీవ్రంగా ఉండొచ్చని హెచ్చరిక**
**-ఇరాన్--హమాస్ మధ్య బలపడుతున్న సంబంధాలు**
**-ఇజ్రాయిల్‌పై ప్రతీకారానికి ప్రత్యేక బృందాలు**
**-మిత్రదేశాల కమాండర్లతో ఐఆర్‌జీసీ చర్చలు**
**-క్షిపణులు, డ్రోన్ల ఉత్పత్తికి మరింత వేగం**
**-అణు సామర్థ్యాల పునరుద్ధరణపై ఇరాన్ దృష్టి**

టెహ్రాన్:
అమెరికాతో కలిసి..తమ దేశంపై యుద్ధోన్మాదానికి దిగిన ఇజ్రాయిల్‌పై ప్రతీకారం తీర్చుకోవాలని ఇరాన్ ఎదురు చూస్తోంది. తమ దేశాధినేతల మరణానికి కారణమైన వారిని అంతం చేస్తామని పలుమార్లు హెచ్చరించింది. ఈ క్రమంలో ఇజ్రాయిల్ నిఘా వర్గాలు కీలక విషయాలు వెల్లడించాయి. తమ దేశంపై భారీ స్థాయిలో దాడులు చేపట్టడానికి ఇరాన్ ప్రణాళిక రచిస్తున్నట్టు ఇజ్రాయిల్ నిఘా వర్గాలు పేర్కొన్నాయి. అన్ని వైపుల నుంచి ఏకకాలంలో తమను లక్ష్యం చేసుకోవడానికి ఇరాన్.. హిజ్బుల్లా, హమాస్, హూతీలు, ఇరాక్‌లోని సాయుధ ముఠాల తో జట్టు కడుతోందని ఆరోపించాయి. భవిష్య త్తులో జరగబోయే ఈ దాడి 2023 అక్టోబర్ 7న హమాస్ దాడికంటే తీవ్రంగా ఉండే అవకాశం ఉందని తెలిపాయి. ఇందులో భాగంగా ఇరాన్‌కు చెందిన ఐఆర్‌జీసీ తన బలగాలను లెబనాన్‌లోని హెజ్బుల్లా, హమాస్, యెమెన్‌లోని హూతీలతో కలిపి మోహరించాలని భావిస్తున్నట్టు వెల్లడించాయి. దీంతో ఇజ్రాయిల్ ప్రధాని వెన్నులో **వణుకు పుట్టిస్తోంది.**
నిఘా వర్గాల ప్రకారం.. 2023 అక్టోబర్ 7న హమాస్ అనుకున్న లక్ష్యాన్ని సాధించలేకపోయింది. దీంతో ఈసారి మిత్రదేశాలతో కలిసి.. ఇజ్రాయిల్‌పై దాడులకు ప్రణాళికలు రచిస్తోంది. ఇజ్రాయెల్‌లోని అనేక ప్రాంతాల్లో ఏకకాలంలో దాడులు చేయాలనేది వారి ప్లాన్. ఈ పరిస్థితులకు హమాస్ నాయకత్వంలో వచ్చిన మార్పు కూడా ఓ కారణం. జులైలో హమాస్ అత్యున్నత నాయకుడిగా ఎన్నికైన ఖలీల్ అల్-హయ్యాకు ఇరాన్‌తో మంచి సంబంధాలు ఉన్నాయి. దీంతో ఇజ్రాయిల్‌పై పగ తీర్చుకోవడానికి ఇరువురు ఏకమయ్యాయి. ఈ దాడి కోసం ఇరాన్ కొన్ని బృందాలను, సమన్వయ యంత్రాంగాలను కూడా సిద్ధం చేస్తున్నట్టు తెలుస్తోంది.

**మరింత వేగంగా ఆయుధాల ఉత్పత్తి**
ఇజ్రాయిల్‌తో ఘర్షణను విస్తరించడంపై హిజ్బుల్లా, హూతీలు, ఇరాకీ మిలీషియాలలోని కమాండర్లతో ఐఆర్‌జీసీ ఖుద్స్ ఫోర్స్ ఉన్నతాధికారులు చర్చలు జరిపారు. ఐఆర్‌జీసీకి చెందిన ఇద్దరు సీనియర్ అధికారులు, ఖుద్స్ ఫోర్స్ సీనియర్ అధికారులు, ఇతర కమాండర్లతో కాన్ఫరెన్స్ కాల్స్ నిర్వహించారు. అలాగే ఇరాన్ సలహాదారులు కూడా క్షేత్రస్థాయిలో వారితో కలిసి పనిచేశారు. అదే సమయంలో క్షిపణులు, డ్రోన్ల ఉత్పత్తిని వేగవంతం చేయడానికి, దెబ్బతిన్న అణు సామర్థ్యాలను పునరుద్ధరించడానికి ఇరాన్ ప్రయత్నిస్తోంది.

## నేటి నుంచి అసెంబ్లీ

మొదటి తరువాయి

ఈ మేరకు అసెంబ్లీ కార్యదర్శి రేండ్ల తిరుపతి బులెటిన్ విడుదల చేశారు. అనంతరం సభా వ్యవహారాల కమిటీ (బీఏసీ) సమావేశమై సభను ఎన్నిరోజులు నడపాలనే దానిపై చర్చించి, నిర్ణయం తీసుకుంటుంది. అయితే ఈనెల 11 వరకే సభ కొనసాగే అవకాశాలున్నాయని సమాచారం. ఆ తర్వాత వరసగా మూడు రోజుల(రెండో శనివారం, ఆదివారం, సోమవారం వినాయక చవితి)పాటు వరసగా సెలవులు రానుండటమే దీనికి కారణమని అసెంబ్లీ కార్యదర్శి కార్యాలయ వర్గాలు తెలిపాయి.
కాగా ఇటీవల మరణించిన మాజీ ఎమ్మెల్యేలు కొమ్మిడి నర్సింహారెడ్డి (భువనగిరి), పెద్ది సుదర్శన్ రెడ్డి (నర్సంపేట)లకు శాసనసభ సంతాపం తెలపాల్సి ఉంది. కానీ అసెంబ్లీ కార్యదర్శి విడుదల చేసిన బులెటిన్‌లో ఆ ప్రస్తావనేదీ లేదు. అంటే తొలిరోజు గాకుండా ఆ తర్వాత వారికి సంతాపాన్ని తెలిపే అవకాశముందా? లేదా? అనేది చూడాలి. మరోవైపు ఢిల్లీలో సోమవారం నిర్వహించబోయే సెంట్రల్ వాటర్ కమిషన్ (సీడబ్ల్యూసీ) సమావేశానికి సీఎం రేవంత్ రెడ్డి హాజరవుతారా? లేదా? అనేది ఆసక్తికరంగా మారింది. ఆ భేటీలో తెలంగాణ, ఏపీకి సంబంధించిన నదీ జలాలపై చర్చ జరిగే అవకాశమున్న నేపథ్యంలో అది అత్యంత ప్రాధాన్యతను సంతరించుకుంది. ?
ఒకే ప్రాంగణంలో శాసనసభ, మండలి...
ఈసారి అసెంబ్లీ సమావేశాలు ప్రత్యేక ప్రాధాన్యతను సంతరించుకున్నాయి. ఇప్పటి వరకూ పబ్లిక్ గార్డెన్స్‌లోని జూబ్లీహాల్ లో కొనసాగిన శాసనమండలి, శాసనసభ భవనం పక్కనే కొలువుదీరనుంది. పాత శాసనసభ భవనం, గతంలో టీడీఎల్పీకి ఉపయోగించుకున్న భవనాలకు మరమ్మతులు చేసిన ప్రభుత్వం... వాటిని కౌన్సిల్ కు కేటాయించింది. ఈ నేపథ్యంలో ఉమ్మడి రాష్ట్రంలో వైఎస్ హయాం నుంచి ఇప్పటిదాకా 24 ఏండ్లపాటు జూబ్లీహాల్‌లో కొనసాగిన శాసనమండలి, ఇప్పుడు శాసనసభ పక్కకే రానుంది. రెండు సభల మధ్యనున్న లాంజ్‌ను పార్లమెంటులో మాదిరిగా సెంట్రల్ హాల్‌లాగా ఉపయోగించనున్నారు. ఈ రీత్యా మీడియా ప్రతినిధులను గతంలో మాదిరిగా లోనికి అనుమతిస్తారా? లేదా? అనేది ప్రశ్నార్థకంగా మారింది

## మూడేళ్లలో డ్రగ్స్ రహిత భారత్

**-2029 నాటికి మాదకద్రవ్య రహిత భారత్ లక్ష్యం**
**-నాలుగు స్థాయిల్లో నార్కో సమన్వయ కేంద్రాలు**
**-రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో ప్రత్యేక టాస్క్‌ఫోర్స్‌లు**
**-ఎన్‌సీబీ పునర్వ్యవస్థీకరణ.. నిదాన్ పోర్టల్‌తో జాతీయ డేటాబేస్**
**-చిన్న ప్యాకెట్ పట్టుబడినా మొత్తం నెట్‌వర్క్ వెలికితీత**
**-2029 మార్చి నాటికి 100 జాతీయ, అంతర్జాతీయ నెట్‌వర్క్‌ల ధ్వంసం**
**-36 దేశాల నుంచి 274 మంది నేరస్థులను భారత్‌కు తీసుకొచ్చాం**
**-నక్సలిజం తరహాలో డ్రగ్స్ ముప్పును అంతం చేస్తాం: అమిత్ షా**

పనాజీ



కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా ఆదివారం గోవాలో మీడియాతో మాట్లాడుతూ, 2029 నాటికి భారతదేశాన్ని పూర్తిగా మాదకద్రవ్య రహితంగా మార్చేందుకు మోదీ ప్రభుత్వం స్పష్టమైన కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేసిందని తెలిపారు. మాదకద్రవ్యాలు లేని యువశక్తి 2047 నాటికి వికసిత భారత్ను నడిపిస్తుందనేది ప్రధాని నరేంద్ర మోదీ లక్ష్యమని పేర్కొన్నారు. నక్సలిజం, ఉగ్రవాదం వంటి ముప్పులను ఎలా అరికట్టామో, అదే పద్ధతిలో మాదకద్రవ్యాల ముప్పును కూడా పూర్తిగా తుడిచిపెడతా మని ధీమా వ్యక్తం చేశారు. 2014కు ముందు మాదకద్రవ్యాలపై పోరాటం చిన్న చిన్న విభాగాల్లో, ఒంటరిగా సాగేదని, ఏజెన్సీలు చిన్న నిందితులను పట్టుకోవడంతోనే సరిపెట్టుకునేవని అమిత్ షా గుర్తు చేశారు. డ్రగ్స్ పై ఈ పోరాటాన్ని జాతీయ భద్రతా ప్రాధాన్యతగా మోదీ ప్రభుత్వం మార్చిందని చెప్పారు.
నాలుగు స్థాయిల్లో నార్కో సమన్వయ కేంద్రాలు
2019లో నాలుగు స్థాయిల నార్కో సమన్వయ కేంద్రం ఏర్పాటు చేశారు. అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో ప్రత్యేక మాదకద్రవ్య నిరోధక టాస్క్ ఫోర్స్లను ఏర్పాటు చేశారు. మాదకద్రవ్య నియంత్రణ బ్యూరోను పునర్వ్యవస్థీకరించి బలోపేతం చేశారు. నిదాన్ పోర్టల్ ద్వారా నేరస్థుల జాతీయ డేటాబేస్ సృష్టించారు. 1933 మానస్ హెల్ప్ లైన్ ప్రారంభించి బాధితుల యువతకు పునరావాసం అందిస్తున్నట్లు కేంద్ర మంత్రి చెప్పారు.
చిన్న ప్యాకెట్ తో నెట్వర్క్ వెలికితీత
కార్యాచరణ ప్రణాళిక నాలుగు స్తంభాలపై ఆధారపడి ఉంది. మేధస్సు, కార్యాచరణ ఆధారిత అమలు, సింథటిక్ మాదకద్రవ్యాలు, పూర్వగామి రసాయనాల నియంత్రణ, డిమాండ్ తగ్గంపు, హాని తగ్గంపు, సామర్థ్య నిర్మాణం, సమన్వయం. దిగువ నుంచి పైకి, పై నుంచి కిందికి దర్యాప్తు విధానం అవలంబిస్తున్నారని అమిత్ షా తెలిపారు. చిన్న ప్యాకెట్ స్వాధీనం చేసుకున్నా మొత్తం నెట్వర్కు వెలికితీస్తారు. సరిహద్దుల్లో పెద్ద సరుకు పట్టుకున్నా వినియోగదారు వరకు జాడ వెతుకుతారని కేంద్ర మంత్రి చెప్పారు.

## యూట్యూబ్ చూసి అవకాడో సాగుపై అవగాహన..

మొదటి తరువాయి

మొదట్లో తన కుటుంబ సభ్యులు వ్యతిరేకించారన్న వరదరాజ్
అవకాడో సాగు ఆలోచనను మొదట్లో తన కుటుంబ సభ్యులు వ్యతిరేకించారని వరదరాజ్ తెలిపారు. "సంప్రదాయ పంటలనే కొనసాగించమని కుటుంబ సభ్యులు చెప్పారు. కానీ నేను ధైర్యం చేసి నాలుగేళ్ల క్రితం నా పొలంలో అవకాడో మొక్కలు నాటాను. ఈ ఏడాది మార్చి నుంచి పంట చేతికి రావడం ప్రారంభమైంది. డబ్బులు కూడా రావడంతో మా కుటుంబంలో మళ్లీ సంతోషం వెల్లివిరిసింది" అని ఆయన ఆనందంగా వివరించారు. ఇప్పటివరకు ఆయన దాదాపు నాలుగు టన్నుల అవకాడో ఫలాలను పండించి, స్థానిక దుకాణాలకు సరఫరా చేస్తున్నారు. నేరుగా మార్కెటింగ్ చేసుకోవడం ద్వారా మంచి ఆదాయాన్ని పొందుతున్నారు.
'మన్ కీ బాత్'లో ప్రస్తావించడం తనకు మాటల్లో చెప్పలేని సంతోషాన్నిచ్చింది
అయితే, ఇంతకంటే పెద్ద ఆనందం తనకు ఢిల్లీ నుంచి లభించిందని వరదరాజ్ అంటున్నారు. ప్రధాని మోదీ తన పేరును, తన ప్రయత్నాన్ని 'మన్ కీ బాత్'లో ప్రస్తావించడం తనకు మాటల్లో చెప్పలేని సంతోషాన్ని ఇచ్చిందన్నారు. "ప్రధాని నన్ను గుర్తించడంతో నా కుటుంబ సభ్యులు, స్నేహితులు, గ్రామస్థుల మధ్య నాకు ఎంతో గుర్తింపు వచ్చింది"





అని ఆయన ఉప్పొంగిపోయారు.
అవకాడో వంటి పండ్లకు మార్కెట్లో గిరాకీ పెరుగుతోందన్న ప్రధాని మోదీ
భారతదేశంలో ప్రజల ఆహారపు అలవాట్లలో మార్పులు వస్తున్నాయని, ఆరోగ్యంపై శ్రద్ధ పెరగడంతో అవకాడో వంటి పండ్లకు మార్కెట్లో గిరాకీ పెరుగుతోందని ప్రధాని మోదీ తన ప్రసంగంలో పేర్కొన్నారు. వరదరాజ్ వంటి వినూత్న రైతులు ఈ అవకాశాలను అందిపుచ్చుకుని, సంప్రదాయ పంటలకు బదులుగా కొత్త పంటలు వేయడం ద్వారా తమ జీవనోపాధిని మెరుగుపరుచుకోవచ్చని సూచించారు. వరదరాజ్ విజయం గ్రామీణ భారతదేశంలో కొత్త అవకాశాలకు నిదర్శనమని ప్రధాని కొనియాడారు

## అమెరికాలోనూ 'సర్'..

**-ఓటర్ల జాబితాల సమీక్షకు ట్రంప్ సర్కారు సిద్ధం**
**-10 లక్షల మంది భారత సంతతి ఓటర్లపై తొలగింపు ముప్పు?**
**-ఓటర్ల జాబితాల సమగ్ర పరిశీలనకు రూ.125 కోట్ల నిధులు**
**-జాతీయ ఓటర్ల డేటాబేస్ సిద్ధం చేసే ప్రక్రియ**
**-నవంబర్ మధ్యంతర ఎన్నికల్లోపు ప్రక్రియ పూర్తి చేయాలని లక్ష్యం**
**-బాధ్యతను ఇమ్మిగ్రేషన్, కస్టమ్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ (ఐసీఈ)కి అప్పగించిన ట్రంప్**
**-50 రాష్ట్రాల్లో ఓటర్ల జాబితాల పరిశీలన, నవీకరణ**
**-ప్రభుత్వ రికార్డులతో ఓటర్ల సమాచారాన్ని సరిపోల్చనున్న కంప్యూటర్లు**
**--వివరాల్లో తేడాలుంటే పునఃపరిశీలన.. తొలగింపునకు అవకాశం**
**-10 లక్షల మంది భారత సంతతి పౌరులపై వేలాడుతున్న కత్తి**



వాషింగ్టన్
భారత్‌లోని 'సర్' (ప్రత్యేక సమగ్ర సమీక్ష) లాగా అమెరికాలో ఓటర్ జాబితాలను నిశితంగా పరిశీలించడాన్ని ఆ దేశాధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రారంభించారు. ఇందుకోసం సుమారు రూ.125 కోట్ల నిధులను విడుదల చేశారు. ఈ ప్రక్రియలో భాగంగా ఓటర్ జాబితాలను పరిశీలించి జాతీయ ఓటర్ డాటా బేస్‌ను సిద్ధం చేస్తారు. ఈ ప్రక్రియలో అమెరికాలో నివసిస్తున్న 26 లక్షల మంది భారత సంతతి ఓటర్లలో 10 లక్షల మందిని ఓటర్ల జాబితా నుంచి తొలగించే ముప్పు ఉందని అంచనా వేస్తున్నారు. నవంబర్‌లో జరిగే మధ్యంతర ఎన్నికల్లోపు ఈ ప్రక్రియను పూర్తి చేయాలని అమెరికా ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకొన్నది. ఈ ప్రక్రియ నిర్వహణను ఇమ్మిగ్రేషన్, కస్టమ్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ (ఐసీఈ)కి ట్రంప్ అప్పగించారు. ఈ ప్రక్రియలో 50 రాష్ట్రాల్లో ఓటర్ల జాబితాను పరిశీలించి, అప్‌డేట్ చేస్తారు. ఓటర్ల సమాచారాన్ని వివిధ ప్రభుత్వ రికార్డులతో సరి చూస్తారు. ఓటర్ల జాబితాలను కంప్యూటర్లు ఇమ్మిగ్రేషన్, ఇతర రికార్డులతో సరి చూస్తాయి. ఒక పేరు లేదా సమాచారం రికార్డులతో సరిపోలకపోతే, ఆ ఓటర్ వివరాలను పునఃతనిఖీ చేస్తారు. అలాంటి వాళ్ల పేర్లను ఓటర్ల జాబితా నుంచి తొలగించే ప్రమాదముంది.
భారతీయులపైనే ఎక్కువ ప్రభావం ఎందుకు?
న్యూయార్క్, న్యూజెర్సీ, కాలిఫోర్నియా, టెక్సాస్ లాంటి రాష్ట్రాల్లో భారత సంతతి ఓటర్లు, వారి రాజకీయ ప్రభావం చెప్పుకోదగ్గ ప్రాముఖ్యతను కలిగి ఉంది. ఓటర్ల వెరిఫికేషన్, నమోదు ప్రక్రియ నిబంధనలు ప్రతి రాష్ట్రానికీ వేర్వేరుగా ఉన్నాయి. అయితే తాజా ప్రక్రియలో రికార్డులను పరిశీలిస్తుండటంతో భారత సంతతి ఓటర్లు కూడా స్క్రూటినీ చేయబడతారు. భారత సంతతి ఓటర్ల ఓటింగ్ సరళిని కూడా తాజా ప్రక్రియలో పర్యవేక్షించవచ్చని తెలుస్తున్నది. అయితే ఎంత మంది పేర్లను వాస్తవంగా తొలగిస్తారనేది ప్రక్రియ పూర్తయిన తర్వాతే తెలుస్తుంది. మరోవైపు ఓటర్ గుర్తింపు కార్డును దేశవ్యాప్తంగా అమలు చేయాలని ట్రంప్ సర్కార్ భావిస్తున్నది. అమెరికన్ ఓటర్ అర్హత చట్టం ప్రతిపాదిత బిల్లు ద్వారా ఓటర్ల రిజిస్ట్రేషన్, ఓటింగ్ నిబంధనలను కఠినం చేయాలని యోచిస్తున్నది.

## మెట్రో రంగంలో భారత్ మరో మైలురాయి

మొదటి తరువాయి



న్యూఢిల్లీ
మెట్రో రైలు రంగంలో భారత్ మరో భారీ మైలురాయిని అందుకోబోతున్నది. రాబోయే రెండేళ్లలో అమెరికా ను వెనక్కి నెట్టి చైనా తర్వాత ప్రపంచంలోనే రెండో అతిపెద్ద మెట్రో రైలు నెట్‌వర్క్ కలిగిన దేశంగా భారత్ అవతరించనుంది. ఈ విషయాన్ని కేంద్ర గృహనిర్మాణ, పట్టణ వ్యవహారాల శాఖ మంత్రి మనోహర్ లాల్ తెలిపారు. ఒకప్పుడు కేవలం కొన్ని నగరాలకే పరిమితమైన మెట్రో సేవలు ఇప్పుడు దేశంలోని 26 నగరాలకు విస్తరించాయని మంత్రి చెప్పారు.రాబోయే రోజుల్లో కొత్త మార్గాలు పెద్ద ఎత్తున అందుబాటులోకి రానుండటంతో భారత్ మెట్రో నెట్‌వర్క్ మరింత వేగంగా పెరగనుందని ఆయన పేర్కొన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 2014లో అధికారంలోకి వచ్చిన సమయంలో దేశంలో కేవలం 5 నగరాల్లో 245 కిలోమీటర్ల మేర మాత్రమే మెట్రో రైలు మార్గాలు అందుబాటులో ఉండేవని మంత్రి గుర్తుచేశారు. ప్రస్తుతం పరిస్థితి పూర్తిగా మారిపోయిందని, దేశవ్యాప్తంగా 26 నగరాల్లో సుమారు 1,170 కిలోమీటర్ల మేర మెట్రో రైలు సేవలు అందుబాటులో ఉన్నాయని మంత్రి తెలిపారు. గడిచిన 12 ఏళ్లలోనే దేశ మెట్రో నెట్‌వర్క్ దాదాపు ఐదు రెట్లు పెరిగిందన్నారు. కేంద్ర ప్రభుత్వం మెట్రో విస్తరణకు పెద్దపీట వేయడంతో కొత్త నగరాల్లోనూ మెట్రో రైలు ప్రాజెక్టులు వేగంగా ముందుకు సాగుతున్నాయని తెలిపారు. భారత్ ప్రస్తుతం ప్రపంచంలో మూడో అతిపెద్ద మెట్రో రైలు నెట్‌వర్క్ కలిగిన దేశంగా ఉంది. చైనా అగ్రస్థానంలో ఉండగా.. అమెరికా రెండో స్థానంలో ఉంది. ప్రస్తుతం కొత్త ప్రాజెక్టులు పూర్తవుతూ, నిర్మాణంలో ఉన్న మార్గాలు అందుబాటులోకి వస్తే రెండేళ్లలో అమెరికాను భారత్ అధిగమించే అవకాశం ఉందని మనోహర్ లాల్ అన్నారు.రాబోయే రెండేళ్లలో అమెరికాను అధిగమించి చైనా తర్వాత ప్రపంచంలోనే రెండో అతిపెద్ద మెట్రో రైలు నెట్‌వర్క్ కలిగిన దేశంగా భారత్ అవతరిస్తుందని తాను భావిస్తున్నానని మంత్రి పేర్కొన్నారు.

## కొత్త ప్రపంచ పటంపై భారత్ అభ్యంతరం

**--జమ్మూకశ్మీర్, లద్దాఖ్‌ను అధికారిక పటం ప్రకారమే చూపాలి**
**-ఐరాస ప్రతిపాదనపై విదేశాంగ శాఖ స్పష్టీకరణ**
**-సరిహద్దులు, వివాదాస్పద ప్రాంతాలపై నిర్ణయాలేవీ లేవు**
**-దేశాల వాస్తవ భూభాగ వైశాల్యాన్ని చూపడమే లక్ష్యం**
**-భారత భూభాగాన్ని తప్పుగా చూపించే అవకాశం ఉందని ఆందోళన**
**-సార్వభౌమాధికారం, ప్రాదేశిక సమగ్రతపై భారత్ స్పష్టమైన వైఖరి**
**-భూభాగ వైశాల్యం ఆధారంగా రూపొందించే పటానికి భారత్ మద్దతు**



న్యూఢిల్లీ
ఐక్య రాజ్య సమితి(ఐరాస) కొత్త ప్రపంచ పటంపై భారత్ తన వైఖరిని స్పష్టం చేసిది. ఐరాస ప్రతిపాదన ఏదైనా నిర్దిష్ట పటాన్ని గుర్తించినట్టు కాదని భారత విదేశాంగ శాఖ ఆదివారం తెలిపింది. ఆ ప్రతిపాదనలో దేశాల సరిహద్దులు, వివాదాస్పద ప్రాంతాలు లేదా వాటి పేర్లపై ఎలాంటి నిర్ణయాలు తీసుకోలేదంది. ప్రతి దేశ వైశాల్యం దాని వాస్తవ పరిమాణానికి అనుగుణంగా కనిపించేలా ప్రపంచ పటాన్ని ప్రదర్శించడమే ఐరాస ప్రతిపాదన ఉద్దేశం.ఈ నేపథ్యంలో జమ్ముకశ్మీర్, లద్దాఖ్ సహా భారత భూభాగం మొత్తాన్ని భారత అధికారిక పటం ప్రకారం చూపించాలని ఐరాసను భారత్ కోరింది. తమ సార్వభౌమాధికారం, ప్రాదేశిక సమగ్రతపై తమ వైఖరి స్పష్టమైనదని, అచంచలమైనదని విదేశాంగ శాఖ పేర్కొన్నది. వాస్తవానికి దేశాలను వాటి సాపేక్ష భూభాగ వైశాల్యం ప్రకారం చూపించే పటాల వినియోగ ప్రతిపాదనకు భారత్ అనుకూలంగా ఓటేసింది. అయితే అలాంటి పటాల్లో భారత భూభాగాన్ని తప్పుగా చూపించే అవకాశం ఉందని భారత్ ఆందోళన చెందుతున్నది.

## జల యుద్ధానికి సిద్ధం కండి

ప్రయత్నం చేయడం లేదనే విషయం ఎన్డీఎస్ఏ ప్రకటనతో స్పష్టమైందని కేసీఆర్ అన్నారు. మేడిగడ్డ వద్ద చిన్నపాటి మరమ్మతులు చేసి కాళేశ్వరాన్ని వినియోగంలోకి తెస్తే సుమారు 13 జిల్లాల రైతులకు ప్రయోజనం కలుగుతుందని, అయినా ప్రభుత్వం ఎందుకు చర్యలు తీసుకోవడం లేదో ప్రజలకు వివరించాలని డిమాండ్ చేశారు. 90 శాతం పూర్తయిన పాలమూరురంగారెడ్డి ఎత్తిపోతల పథకాన్ని నిర్లక్ష్యం చేయడాన్ని సహించేది లేదన్నారు. నాగార్జున సాగర్, శ్రీశైలం ప్రాజెక్టుల్లో నీరు ఉన్నా తెలంగాణ పంటలకు విడుదల చేయకపోవడంపై ప్రభుత్వాన్ని నిలదీయాలని చెప్పారు. గోదావరికావేరి నదుల అనుసంధానం పేరుతో రాష్ట్రానికి నష్టం కలిగించే నిర్ణయాలను వ్యతిరేకించాలని సూచించారు.
హామీలపై నిలదీయా
కాంగ్రెస్ ప్రభుత్వం 100 రోజుల్లో అమలు చేస్తామని చెప్పిన హామీలను వెయ్యి రోజులు గడిచినా ఎందుకు అమలు చేయలేదని అసెంబ్లీలో ప్రశ్నించాలని కేసీఆర్ అన్నారు. 22ఏ నిషేధిత జాబితాలో పట్టా భూములను చేర్చడంతో పేదలు, మధ్యతరగతి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, అత్యవసర పరిస్థితుల్లో భూములు విక్రయించుకోలేకపోతున్నారని పేర్కొన్నారు. ఈ సమస్యపై ప్రభుత్వాన్ని గట్టిగా నిలదీయాలని సూచించారు. మిషన్ భగీరథను నిర్వీర్యం చేసి తాగునీటి సమస్యను పెంచారని, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించకుండా విద్యార్థులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. పాలిటెక్నిక్ విద్యను దెబ్బతీసేలా జీఓ 97 తీసుకువచ్చారని విమర్శిస్తూ దాన్ని సభలో ఎండగట్టాలని కోరారు. నిరుద్యోగులకు ఇచ్చిన హామీలు, జాబ్ క్యాలెండర్, ఉద్యోగ నోటిఫికేషన్లపై ప్రభుత్వాన్ని ప్రశ్నించాలని చెప్పారు.
ఫార్మాసిటీ, సింగరేణిపైనా పోరాటం
బీఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఫార్మాసిటీని రద్దు చేసి, ఫ్యూచర్ సిటీ పేరుతో పేదల భూములను రియల్ ఎస్టేట్ దందాకు ఉపయోగిస్తున్నారని కేసీఆర్ ఆరోపించారు. ప్రభుత్వ భూముల విక్రయాలు, సింగరేణిలో అవినీతి, మెట్రో రైలు నిర్వహణను ప్రభుత్వ పరిధిలోకి తీసుకోవడం వంటి అంశాలపై సభలో నిలదీయాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలలను తగ్గించే ప్రయత్నాలు జరుగుతున్నాయని, గురుకులాల్లో విద్యార్థుల మరణాలు ఆందోళన కలిగిస్తున్నాయని అన్నారు. విద్యా వ్యవస్థ క్షీణత, మహిళలపై నేరాలు, శాంతిభద్రతల వైఫల్యం, అవినీతి, బంధుప్రీతి, ఆశ్రితపక్షపాతంపై కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఉభయ సభల్లో ఎండగట్టాలని పిలుపునిచ్చారు.

## ఉద్యోగుల ఆరోగ్య భద్రతే ప్రభుత్వ లక్ష్యం

మొదటి తరువాయి

కుటుంబ సభ్యులు, డిపెండెంట్ల ఆరోగ్య భద్రత కోసం తీసుకొచ్చిన నూతన ఉద్యోగుల ఆరోగ్య పథకాన్ని ప్రభుత్వం సమర్థంగా అమలు చేస్తుందని చెప్పారు. దశాబ్దాలుగా ఉద్యోగులు ఎదురుచూ స్తున్న సమస్యను మానవీయ కోణంలో పరిష్కరిం చాలనే ఉద్దేశంతోనే ప్రభుత్వం ఈ పథకాన్ని అమల్లోకి తెచ్చిందన్నారు. ప్రభుత్వంలో పనిచే స్తున్న ఉద్యోగులంతా తమవారేననీ, వారు ఆరోగ్యంగా ఉండాలన్నదే ప్రభుత్వ ప్రధాన ఉద్దేశమని అన్నారు. ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు, డిపెండెంట్లు గానీ అనారోగ్యానికి గురైనప్పుడు ఆర్థిక, మానసిక ఇబ్బందులకు గురికాకూడదన్న ఉన్నతమైన ఆశయంతోనే అనేక ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ ప్రభుత్వం ఈ పథకాన్ని అమలు చేస్తోందన్నారు. ఈ పథకం రూపకల్పన, విధివిధానాల విషయంలో ఉద్యోగ సంఘాలతో అనేకసార్లు సమావేశాలు నిర్వహించి, వారి సూచనలు, అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకున్నామని వివరించారు. ఉద్యోగుల గురించి మానవీయ కోణంలో ప్రజాప్రభుత్వం తెచ్చిన పథకాన్ని విజయవంతం చేయాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని స్పష్టం చేశారు.

జర్నలిస్ట్ డైరీ
తెలుగు దినపత్రిక

# లక్ష్మీదేవిపల్లి పై ప్రశ్నిస్తే

# బెదిరింపులు సరికాదు.సమాధానాలు వెతకండి!

**-ప్రజా సమస్యల పై ప్రశ్నిస్తే ప్రతిఫలంగా మూల్యం చెల్లించుకోవాల్సి వస్తే దానికి మేము సిద్ధమే.**

**-ప్రజా సంఘాల నాయకులు**



**రంగారెడ్డి జిల్లా బ్యూరో, సెప్టెంబర్ 06 (జర్నలిస్ట్ డైరీ) :** లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్ పై ప్రజా సంఘాలుగా ప్రజల పక్షాన మాకు ఉన్న అనుమానాలను ప్రశ్నిస్తే బెదిరింపులకు పాల్పడటం సరైంది కాదని, ప్రజా సమస్యలపై ప్రశ్నిస్తే ప్రతిఫలంగా మూల్యం చెల్లించుకోవాల్సి వస్తే దానికి మేము సిద్ధంగా ఉన్నామని ప్రజా సంఘాల నాయకులు తిరుమలయ్య, పినపాక ప్రభాకర్, టీజీ.శ్రీనివాస్, రవీంద్రనాథ్, బి.సత్యం , అర్జునప్ప, ప్రశాంత్, శ్రీకాంత్, ఆకాష్ నాయక్, సత్యనారాయణలు ఒక ప్రకటనలో తెలిపారు.

ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ప్రజా సంఘాల నాయకులు మాట్లాడుతూ..... లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్ భూసేకరణకు నోటిఫికేషన్ వెలువడిన సందర్భంలో ప్రజా సంఘాలుగా మేము ప్రాజెక్ట్ యొక్క డిపిఆర్ ను బయట పెట్టాలని, ఈ రిజర్వాయర్ ద్వారా రైతాంగానికి , పరిశ్రమలకు ఎంత నీరు కేటాయిస్తారు అనే విషయం ప్రభుత్వం చెప్పాలి అని డిమాండ్ చేసాము. అదే విధంగా సాగు నీరు, త్రాగు నీరు అందించటం ప్రాజెక్టుల యొక్క ముఖ్య ఉద్దేశం . అందువల్ల మేము రైతాంగానికి మొత్తం ఎన్ని ఎకరాలకు ఏయే నియోజకవర్గాలలో, ఏయే మండలాలలో నీరు అందిస్తారు అనేది ప్రజలకు తెలపాలని కోరడం జరిగింది.

పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకం మొదట డిజైన్ జూరాల నుండి నీటిని ఎత్తిపోయాలని ప్రతిపాదిత దశలో లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్ సామర్థ్యం 10 టీఎంసీ లుగా ఉంది. కానీ గత ప్రభుత్వం డిజైన్ ను మార్చిన తరువాత రిజర్వాయర్ సామర్థ్యాన్ని 2.8 టీఎంసీ లుగా ప్రదీపాదన చేశారు. దీని ద్వారా 4 లక్షల 13 వేల ఎకరాలకు సాగునీరు అందిస్తామని ప్రతిపాదనలు చేశారు. గత ప్రభుత్వం ఈ రిజర్వాయర్ ను విస్మరించిన సందర్భంగా ఇప్పుడు తిరిగి కాంగ్రెస్ ప్రభుత్వం ఈ రిజర్వాయర్ ను మొదలు పెడుతున్న తరుణంలో ఈ రిజర్వాయర్ కింద సాగు నీరు ఎన్ని ఎకరాలకు ఆయకట్టు ఉన్నదో చెప్పాల్సిన బాధ్యత కాంగ్రెస్ ప్రభుత్వం పై ఉంది. గత మూడు దశాబ్దాలుగా పాలమూరు రంగారెడ్డి జిల్లాలకు సాగునీరు, త్రాగునీరు అందించాలని ప్రజా సంఘాలు ప్రజలు పోరాడుతూనే ఉన్నారు. అన్ని రాజకీయ పార్టీలు పాలమూరుకు అన్యాయమే చేశాయి. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రంలో కూడా పాలమూరుకు అన్యాయమే జరిగింది. ప్రస్తుతం అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం కూడా పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి ప్రాధాన్యత ఇవ్వకుండా మరో సారి పాలమూరుకు అన్యాయం చేసే విధంగా డిండి ఎత్తిపోతల పథకం పేరుతో పాలమూరు రంగారెడ్డి కి రావాల్సిన నీటిని నల్గొండకు తరలిస్తున్నారు. ఈ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్ట్ నుండే నల్గొండకు నీటిని తరలిస్తే లక్ష్మీదేవిపల్లి కి చుక్క నీరు కోడా వచ్చే అవకాశం లేదు. కాబట్టి డిండి లిఫ్టును అడ్డుకోవాలని చెప్పటం జరిగింది. అంతేకాకుండా ఈ ప్రాంతంలో పర్యావరణ విధ్వంసం చేసే డేటా సెంటర్ల నిర్మాణం కూడా శరవేగంగా జరుగుతున్నాయి. డేటా సెంటర్ల నిర్వాహణకు సర్వర్లను చల్లబర్చటానికి విపరీతమైన నీటిని వినియోగించాల్సిన అవసరం ఉంటుంది. కాబట్టి ఇవన్నీ అంశాలు దృష్టిలో ఉంచుకొని లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్ యొక్క డిపిఆర్ ను బయట పెట్టాలని డిమాండ్ చేయటం జరిగింది. మేము లేవనెత్తిన అంశాలపై సమాధానాలు ఇవ్వకుండా బెదిరింపులకు పాల్పడటం అనేది నియంతృత్వ పాలనకు నిదర్శనం.షాద్ నగర్ నియోజకవర్గంలో అధికార పార్టీ ప్రజల నుండి , ప్రజాసంఘాల నుండి వచ్చే నిరసనలను అంగీకరించే స్థితిలో లేదు. నిరసనలు తెలపడం అనేది ప్రజాస్వామిక హక్కు , ప్రభుత్వాలు ప్రజాస్వామ్య బద్ధంగా పరిపాలన చేయాలి కానీ అందుకు విరుద్ధంగా కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం ద్వారా బెదిరింపులు, అక్రమ కేసులు నమోదు చేయడం, ప్రజల నిరసనలను అదుపులోకి తీసుకురావాలని నియంతృత్వ విధానంతో పనిచేస్తుంది. ప్రజాస్వామ్య బద్ధంగా ఎన్నికైన ప్రభుత్వాలు నియంతృత్వ పాలనా విధానాన్నీ ఎంచుకోవడం దురదృష్టకరం. ఈ మధ్య కాలంలో షాద్ నగర్ లో ప్రతి పక్షాలు, ప్రజా సంఘాలు, విద్యార్థి సంఘాలు ప్రభుత్వాలు చేస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ఉద్యమిస్తున్న ప్రతీ సందర్భంలో బెదిరింపుల విధానాన్ని ఎంచుకోవడం హేయమైన చర్యగా భావిస్తున్నాం.ప్రజాస్వామ్యం ఫరిడవిల్లాలంటే ప్రజల యొక్క అసంతృప్తులకు చోటు కల్పించాలి. అలా కాకుండా అణిచివేతా విధానాలను ఎంచుకోవడం ప్రజాస్వామ స్ఫూర్తికి విరుద్ధం. ఈ ఈ విధానాలను తీవ్రంగా ఖండిస్తున్నాము. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎన్నికల సమయంలో ఆరు గ్యారంటీలతో పాటు ఏడవ గ్యారంటీగా "ప్రజాస్వామ్య పునరుద్ధరణ" ను ప్రకటించారు. కానీ అందుకు భిన్నంగా రాష్ట్రంలో ఇక్కడ పాలన కొనసాగుతుంది. ప్రజల సమస్యలను పాలకుల దృష్టికి తీసుకువస్తున్న ప్రజా సంఘాలు, విద్యార్థి సంఘాల నాయకులు "తగినమూల్యం చెల్లించుకోవాల్సి ఉంటుందని" ఇక్కడి కాంగ్రెస్ నాయకులు హెచ్చరికలు జారీ చేస్తున్నారు. ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకువస్తే అందుకు ప్రతిఫలంగా మూల్యం చెల్లించుకోవాల్సి వస్తే అందుకు మేము సిద్ధంగానే ఉంటాము. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం షాద్ నగర్లో ప్రజాస్వామ్య బద్ధంగా పరిపాలన చేయాలని, ప్రజలు , ప్రజా సంఘాలు లేవనెత్తున్న ప్రశ్నలకు సమాధానాలు చెప్పాలని తెలియజేస్తున్నాం. మీ బెదిరింపులు, అక్రమ కేసుల వల్ల మా కార్యాచరణను నియంత్రించాలని అనుకోవడం సరైంది కాదు. ఇకనైనా లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్ డిపిఆర్ బయట పెట్టాలని, డిండి లిఫ్ట్ ను వ్యతిరేకించాలని, డేటా సెంటర్లకు నీరు ఎక్కడనుండి ఇస్తారో చెప్పాలి. లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్ ద్వారా ఎన్ని లక్షల ఎకరాలకు సాగునీరు అందిస్తారో తెలియజేయాలని డిమాండ్ చేస్తున్నాము. లేని పక్షంలో ప్రజల ఆగ్రహానికి గురికాజ తపదని తెలియజేస్తున్నాము.

ఈ కార్యక్రమంలో పౌరహక్కుల సంఘం రాష్ట్ర కార్యదర్శి తిరుమలయ్య, కార్మిక సంక్షేమ సంఘం రాష్ట్ర కన్వీనర్ పినపాక ప్రభాకర్, తెలంగాణ విద్యావంతుల వేదిక రాష్ట్ర కోశాధికారి టీజీ శ్రీనివాస్, తెలంగాణ ప్రజా ఫ్రంట్ జిల్లా అధ్యక్షుడు అర్జునప్ప, పాలమూరు అధ్యయన వేదిక జిల్లా అధ్యక్షుడు రవీంద్రనాథ్, పాలమూరు ప్రాజెక్టుల సాధన కమిటీ చైర్మన్ సత్యనారాయణ, బీసీ యువజన సంఘం నేత పసుపుల ప్రశాంత్, ఎస్ఎఫ్ఐ నేత శ్రీకాంత్, ఏఐఎస్ఎఫ్ నేత ఆకాష్ నాయకు లు పాల్గొన్నారు.

# వెయ్యి రోజుల కాంగ్రెస్ పాలనలో గిరిజనులకు ఇచ్చింది శూన్యం

**-ప్రజా పాలన పేరుతో విఫలమైన కాంగ్రెస్ ప్రభుత్వం**

**-లంబాడి హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు మూడవాత్ రాంబల్ నాయక్**



**రంగారెడ్డి జిల్లా బ్యూరో, సెప్టెంబర్ 06 (జర్నలిస్ట్ డైరీ) :** రంగారెడ్డి జిల్లా ఇంజాపూర్ లో లంబాడి హక్కుల పోరాట సమితి ముఖ్య కార్యకర్తల సమావేశం కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడిన లంబాడి హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు రాంబల్ నాయక్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో లంబాడీల సంస్కృతి సాంప్రదాయాలను గోర్ బోలి భాష ను కాపాడాలని లంబాడీల భాష అయిన గోర్ బోలి భాషను భారత రాజ్యాంగంలోని ఎనిమిదవ షెడ్యూల్లో చేర్చాలని అలాగే అదేవిధంగా భారతదేశం మొత్తం నిర్వహించే బంజారాల పండుగ తీజ్ (మొలకల )పండుగను జాతీయ పండుగగా గుర్తించాలని రాంబల్ నాయక్ గారు డిమాండ్ చేశారు. అదేవిధంగా కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి వెయ్యి రోజులు గడిచిపోయాయని కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు ఇచ్చిన చేవెళ్ల ఎస్సీ ఎస్టీ డిక్లరేషన్ లో గిరిజనులకు ఇచ్చిన 12 హామీలలో ఒక్క హామీ కూడా ఇప్పటివరకు నెరవేర్చకపోవడం దురదృష్టకరమని ఇలాంటి పార్టీలు రాష్ట్రాన్ని భ్రష్టు పట్టిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు, లంబాడీల భూములను గుంజుకోవడమే వారి పనిగా పెట్టుకున్నాయని రాంబల్ నాయక్ రాష్ట్ర ప్రభుత్వంపై విరుచుకుపడ్డారు,ఈ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన అనుచరులు తన సోదరులు మొత్తం హైదరాబాద్ చుట్టుపక్కల ఉన్న భూములను గుంజుకొని వేల కోట్ల పెట్టుబడులు అమెరికా లాంటి దేశాలలో పెట్టుబడులు పెడుతున్నారని ఈ రాష్ట్రాన్ని దివాలా తీసి తాము తమ కుటుంబము తన అనుచర వర్గం మాత్రమే బాగుపడుతున్నారని ఎస్సీ ఎస్టీ బీసీ విద్యార్థుల ఫీజు రియంబర్స్మెంట్ గాని స్కాలర్షిప్ల గాని ఇవ్వకుండా సతాయిస్తున్నారని వెయ్యి రోజులు దాటిన ట్రైకార్ గిరిజన సంక్షేమ శాఖలో ఇప్పటివరకు ఒక్క రూపాయి కూడా కేటాయించకపోవడాన్ని లంబాడి హక్కుల పోరాట సమితి తీవ్రంగా ఖండిస్తూ ఉన్నదని రాంబల్ నాయక ఆవేదన వ్యక్తం చేశారు,రంగారెడ్డి జిల్లాలో గురుకుల పాఠశాలలో 12 వ తరగతి చదువుతున్న అమ్మాయి ఆత్మహత్య చేసుకుంటే ప్రభుత్వానికి చలనం లేదని అలాగే తొక్కు కూడా గ్రామంలో నర్సింగ్ చదువుతున్న గిరిజన అమ్మాయి అత్యాచారం చేసి హత్య చేస్తే ఈ ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తున్నారని రాంబల్ నాయక్ ఆవేదన వ్యక్తం చేశారు ఇప్పటికైనా ప్రభుత్వం తమ తప్పులు తెలుసుకొని జరిగిన దాంట్లో పై పూర్తిస్థాయిలో విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు కానీ కొంతమంది అసలు విషయం నువ్వు తప్పుదోవ పట్టిస్తూ కాంగ్రెస్ పార్టీ మోచేతి నీళ్లు తాగి లాగా వ్యవహరిస్తున్నారని ఆయన హెచ్చరించారు ఇలాంటి పనికిమాలిన చర్యలకు పాల్పడితే ఉపేక్షించబోమని వారిని ఉద్దేశించి హెచ్చరించారు,ఇప్పటికైనా ఈ ప్రభుత్వం మారుతుందని ఆశిస్తున్నానని రాంబల్ నాయక్ ఆశాభావం వ్యక్తం చేశారు లేదంటే రాబోయే రోజుల్లో కాంగ్రెస్ పార్టీని బొంద పెట్టాలని కాంగ్రెస్ పార్టీ లంబాడీలకు ప్రభుత్వంలో స్థానం కల్పించకపోవడాన్ని రాంబల్ నాయక్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ముఖ్యమంత్రిపై తీవ్రస్థాయిలో విరుచుకో పడ్డారు వెయ్యి రోజులు ప్రజాపాలన పేరు మీద వెయ్యి రోజులు పూర్తి చేసుకున్న కాంగ్రెస్ ప్రభుత్వం గిరిజనులకు వెయ్యి రూపాయలు కూడా కేటాయించకపోవడాన్ని ఈ ప్రభుత్వ పాలనకు నిదర్శనమని ఇలాంటి నీచమైన పాలన పోవాలని రాబోయే రోజుల్లో మంచి పాలకులను ఎన్నుకోవాలని ప్రజలను కోరారు ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు బాతావత్ శ్రీనివాస్ నాయక్ హితావత్ రమేష్ బాబు నాయక్ సుభాష్ నాయక్ ఎస్ఎస్ శ్రీనివాస్ నాయక్ రాజ్ కుమార్ నాయక్ మకట్లాల్నాయక్ భాష నాయక్ జైపాల్ నాయక్ జానకి రామ్ నాయక్ కిషన్ సింగ్ జిల్లా నాయక్ కె శ్రీనివాస్ నాయక్ కే శివ నాయక్ గోవర్ధన్ నాయక్ భూక్య సుభాస్నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# ముసిలయ్య సేవలు మరువలేనివి

**- మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్**



**రంగారెడ్డి జిల్లా బ్యూరో, సెప్టెంబర్ 06 (జర్నలిస్ట్ డైరీ) :** ముసిలయ్య సేవలు మరువ లేనివి అని మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ అన్నారు. ఆదివారం నందిగామ మండలంలోని నర్సప్పగూడ గ్రామంలో మాజీ సర్పంచ్, మాజీ ఎంపీటీసీ స్వర్గీయ గోవిందు ముసిలయ్య 12వ వర్ధంతి వేడుకలు నర్సప్పగూడ గ్రామం మాజీ సర్పంచ్ గోవిందు అశోక్ కుమార్ ఆధ్వర్యంలో 12వ వర్ధంతి వేడుకలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ హాజరై ముసలయ్య విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ముసలయ్య గ్రామ అభివృద్ధికి ఎంతో సేవా కార్యక్రమాలు ఎన్నో సహాయ సహకారాలు చేశారన్నారు. అదేవిధంగా రోడ్డు విద్యుత్ సౌకర్యం వంటి పనుల కు కృషి చేశారన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ చైర్మన్ వంకాయల నారాయణరెడ్డి, నాయకులు వెంకట్ రెడ్డి, ఈట గణేష్, మామిళ్ళ విఠల్, స్థానిక సర్పంచ్ కొడిచర్ల రాజేశ్వరి శ్రీనివాస్, జట్ట కుమార్, కాట్న శ్రీశైలం, మాజీ సర్పంచులు మాజీ ఎంపీటీసీలు, బీఆర్ఎస్ శ్రేణులు తదితరులు పాల్గొన్నారు.

# ఇబ్రహీంపట్నంలో బీఆర్ఎస్ నూతన కార్యాలయం ప్రారంభం



**ఇబ్రహీంపట్నం: ( సెప్టెంబర్ 06) జర్నలిస్ట్ డైరీ.** రానున్న రోజుల్లో విద్యార్థి నాయకులు పార్టీ బలోపేతానికి కృషి చేయాలని జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి పిలుపునిచ్చారు. ప్రజా సమస్యలపై పోరాడుతూ పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో విద్యార్థి విభాగం కీలకపాత్ర పోషించాలని ఆయన అన్నారు.ఇబ్రహీంపట్నం నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ నూతన కార్యాలయాన్ని జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు మంచిరెడ్డి కిషన్ రెడ్డి, రాష్ట్ర నాయకులు క్యామ మల్లేష్, మంచిరెడ్డి ప్రశాంత్ కుమార్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థి విభాగం నాయకులు మంచిరెడ్డి కిషన్ రెడ్డిని కలిసి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా కిషన్ రెడ్డి మాట్లాడుతూ.. పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేసేందుకు విద్యార్థి నాయకులు సమష్టిగా పనిచేయాలని సూచించారు. రాబోయే ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ మరోసారి విజయం సాధిస్తుందనే ధీమా వ్యక్తం చేశారు.కార్యాలయ ప్రారంభోత్సవ సందర్భంగా శుభాకాంక్షలు తెలిపిన వారిలో ఇబ్రహీంపట్నం నియోజకవర్గ అధ్యక్షులు నిట్టు జగదీశ్వర్, మున్సిపాలిటీ అధ్యక్షులు మడుపు శివ సాయి, మండల అధ్యక్షులు అంబోత్ ప్రవీణ్ నాయక్, నియోజకవర్గ నాయకులు సర్పంచ్ రాఘవేంద్ర గౌడ్, పి. శివకుమార్, కొత్త గణేష్ గౌడ్, పి. తిరుమల్ రెడ్డి, దొండ మనీష్ రెడ్డి, దొండ శివ రెడ్డి, సోయల్, భానతదితరులు పాల్గొన్నారు.

# సరికొత్త రుచులతో,వ్యాపార ప్రస్థానం విజయవంతంగా సాగాలి

**-ఎమ్మెల్సీ నాగర్ కుంట నవీన్ రెడ్డి**

**-దశ 10 పుడ్ పార్క్ హోటల్ ప్రారంభోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి**




**రంగారెడ్డి జిల్లా బ్యూరో, సెప్టెంబర్ 06 (జర్నలిస్ట్ డైరీ) :** షాద్ నగర్ పట్టణంలోని మహబూబ్నగర్ రోడ్డులో భార్గవ్ గౌడ్ ఏర్పాటు చేసిన దశ 10 పుడ్ పార్క్ హోటల్ ప్రారంభోత్సవానికి ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి హాజరై యాజమాన్యానికి శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి మాట్లాడుతూ వినియోగదారుల అభిరుచులకు అనుగుణంగా, సరికొత్త రుచులతో, నాణ్యమైన వంటకాలతో ఈ హోటల్ ప్రజల ఆదరణ పొందాలని ఆకాంక్షించారు.వ్యాపార రంగంలో సరికొత్త ప్రమాణాలు నెలకొల్పుతూ, ఈ సంస్థ ప్రస్థానం విజయవంతంగా సాగాలని, యాజమాన్యానికి మంచి లాభాలు రావాలని ఆయన మనస్ఫూర్తిగా శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ వాణీ పాండురంగ రెడ్డి,గౌస్ జానీ,పోమాల్ పల్లి సర్పంచ్ స్వప్న భూపాల్ రెడ్డి,మాజీ కౌన్సిలర్లు కానుగు అనంతయ్య,చింటూ ప్రతాప్ రెడ్డి,యుగేందర్,చెట్ల నరసింహ,శ్రీనివాస్ గౌడ్,చిన్న యాదగిరి, చెన్నయ్య,కంటెస్టెడ్ కౌన్సిలర్ నక్కల వెంకటేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## యాచారం మండలం కొత్తపల్లిలో ఘనంగా ఈదమ్మ-మడేలయ్య స్వామి బోనాల వేడుకలు



**యాచారం ( సెప్టెంబర్6) జర్నలిస్ట్ డైరీ.** కొత్తపల్లి గ్రామ రజక సంఘం ఆధ్వర్యంలో ఈదమ్మ -మడేలయ్య స్వామి బోనాల వేడుకలను ఆదివారం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. బోనాల సందర్భంగా గ్రామంలోని మహిళలు, భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి అమ్మవారికి బోనాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి నామస్మరణలతో ఆలయ పరిసరాలు మార్మోగగా, గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. ఈ వేడుకల్లో గ్రామ సర్పంచ్ చిక్కుడు వెన్నెల శేఖర్, ఉపసర్పంచ్ కాలే అనితా రమేష్, పాలకవర్గ సభ్యులు పాల్గొని అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. గ్రామ ప్రజలు కుటుంబ సమేతంగా బోనాల వేడుకల్లో పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందారు. ప్రతి సంవత్సరం నిర్వహించే ఈ బోనాల వేడుకలు గ్రామ ప్రజల్లో భక్తిభావాన్ని, ఐక్యతను చాటిచెప్పేలా సాగాయి. ఈ కార్యక్రమంలో రజక సంఘం నాయకులు కృష్ణ, అరుణ్, శ్రీహరి, రామకృష్ణ, శ్రీరాములు, పాండు,కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

## రియల్ ఎస్టేట్ రంగంలో నమ్మకమైన సేవలు అందించాలి

**-ఎమ్మెల్సీ నాగర్ కుంట నవీన్ రెడ్డి**

**-జీవి ప్రాపర్టీస్ రియల్ ఎస్టేట్ కార్యాలయం ప్రారంభోత్సవం ప్రారంభించిన ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి**



**రంగారెడ్డి జిల్లా బ్యూరో, సెప్టెంబర్ 06 (జర్నలిస్ట్ డైరీ) :** షాద్ నగర్ పట్టణంలోని అయ్యప్ప కాలనీలో గోపాల్ గౌడ్,మరియు విశ్వనాథ్ గౌడ్ ఏర్పాటు చేసిన జీవీ ప్రాపర్టీస్ రియల్ ఎస్టేట్ కార్యాలయ ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి మాట్లాడుతూ రియల్ ఎస్టేట్ రంగంలో జీవి ప్రాపర్టీస్ సంస్థ రాణించాలని, వినియోగదారులకు నమ్మకమైన,పారదర్శకమైన సేవలను అందించాలని ఆయన ఈ సందర్భంగా యాజమాన్యానికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ బిఎస్ సుధీర్,వానీ పాండురంగ రెడ్డి,గౌస్ జానీ,అశోక్,పోమాల్ పల్లి సర్పంచ్ స్వప్న భూపాల్ రెడ్డి,మాజీ కౌన్సిలర్లు కానుగ అనంతయ్య,చింటూ ప్రతాప్ రెడ్డి,యుగేందర్,చెట్ల నరసింహ,శ్రీనివాస్ గౌడ్,చిన్న యాదగిరి,చెన్నయ్య,కంటెస్టెడ్ కౌన్సిలర్ నక్కల వెంకటేష్ గౌడ్, నాయకులు రాజునాయక్,దినేష్ సాగర్,శివ చారి,మల్లేష్,అల్లాడ శేఖర్, అన్వారీ రాజు, సంతు, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ విమోచన జైత్రయాత్రలో పాల్గొనకుండా అక్రమ అరెస్టులు!

**-దాడులు, అరెస్టులు, కేసులు ఇదే కాంగ్రెస్ ప్రజాపాలన..!**

**-బిజెపి కొందుర్గు మండల అధ్యక్షులు చిట్టెం లక్ష్మీకాంతరెడ్డి**



**రంగారెడ్డి జిల్లా బ్యూరో, సెప్టెంబర్ 06 (జర్నలిస్ట్ డైరీ) :** తెలంగాణ విమోచన దినోత్సవాన్ని పురస్కరించుకొని బీజేపీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న తెలంగాణ విమోచన జైత్రయాత్రలో పాల్గొనకుండా నాయకులు కార్యకర్తలను అక్రమ అరెస్టు చేయడం కాంగ్రెస్ ప్రభుత్వ దుర్మార్గపు చర్య అని బిజెపి కొందుర్గు మండల అధ్యక్షులు చిట్టెం లక్ష్మీకాంతరెడ్డి స్పష్టం చేశారు. ప్రజాస్వామ్య పద్ధతిలో బీజేపీ చేపడుతున్న కార్యక్రమాలను అడ్డుకునేందుకు అక్రమ అరెస్టులు, నిర్బంధాలు చేయడం సరికాదన్నారు. అరెస్టులు చేసి, బెదిరించి బీజేపీ పోరాటాలను ఆపలేరని హెచ్చరించారు. తెలంగాణ విమోచన కోసం పోరాడిన వీరుల త్యాగాలను ప్రజలకు తెలియజేయడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. ప్రభుత్వం ఎన్ని అడ్డంకులు సృష్టించినా వెనక్కి తగ్గకుండా ప్రజల పక్షాన బీజేపీ పోరాటాన్ని కొనసాగిస్తుందని తెలిపారు.

# గ్రామ అభివృద్ధికి బాటలు వేసిన ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి

**-సుందరపూర్ గ్రామం నుండి మహాలింగేశ్వర స్వామి ఆలయం వరకు మట్టి రోడ్డు ఏర్పాటు**

**-5లక్షల సొంత నిధులతో మట్టిరోడ్డు ఏర్పటు పట్ల సంతోషం వ్యక్తం చేసిన పరిసర గ్రామ ప్రజలు**



**రంగారెడ్డి జిల్లా బ్యూరో, సెప్టెంబర్ 06 (జర్నలిస్ట్ డైరీ) :** కేశంపేట మండలం సుందరపూర్ గ్రామం నుండి శ్రీ మహాలింగేశ్వర స్వామి వారి ఆలయం వరకు భక్తులకు మరియు గ్రామ ప్రజలకు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఉండడంతో ఎమ్మెల్సీ నవీన్ రెడ్డిని మాజీ సర్పంచ్ యారం శేఖర్ రెడ్డి మరియు గ్రామస్తులు రోడ్డు బాగుకోరకు మరమ్మతులు కోరగా స్పందించిన ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి గత నెలలో సుమారు రెండున్నర కిలోమీటర్ల రోడ్డుకు 5లక్షలతో మరమ్మతులు చేయించి మొరం పోయించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ నవీన్ రెడ్డిని గ్రామ ప్రజల కోరిక మేరకు ఒకసారి ఆలయాన్ని సందర్శించి,పూర్తి చేసిన రోడ్డును పరిశీలించాల్సిందిగా మాజీ సర్పంచ్ యారం శేఖర్ రెడ్డి కోరడంతో ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి ఈరోజు ఆదివారం ఉదయం సుందరాపూర్ గ్రామాన్ని మరియు మహాలింగేశ్వర స్వామి ఆలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలు ఎమ్మెల్సీ నవీన్ రెడ్డికి ఘనస్వాగతం పలికి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి మాట్లాడుతూ నన్ను నమ్మి,నాతో నడుస్తున్న నాయకులకు ప్రజలందరికీ ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు,పల్లెల అభివృద్ధికి నా వంతు కృషి నిరంతరం కొనసాగుతుందని అన్నారు. ఈ సందర్భంగా యారం శేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో గ్రామస్తులు ఇంతటి పవిత్ర పుణ్యక్షేత్రానికి ప్రభుత్వం నుండి ఎటువంటి నిధులు రాకున్నా తన సొంత నిధులతో రోడ్డును బాగు చేయించిన ఎమ్మెల్సీ నవీన్ రెడ్డికి మేమంతా రుణపడి ఉంటామని భగవంతుడు వారికి ఎల్లప్పుడూ తోడు ఉండాలని వారు మరిన్ని ఉన్నత శిఖరాలకు ఎదగాలని ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి బాగుకోరాకు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సుందరాపూర్ సర్పంచ్ భారతి రవీందర్,కేశంపేట సర్పంచ్ బొజ్జం సంతోష శ్రీశైలం,పోమాల్ పల్లి సర్పంచ్ స్వప్న భూపాల్ రెడ్డి,భైర్కాన్ పల్లి సర్పంచ్ తనయుడు శివ యాదవ్,మాజీ సర్పంచులు,శేఖర్ పంతులు,ఆంజనేయులు యాదవ్,జంగయ్య,మాజీ ఎంపిటిసి కోటేశ్వర్, ఉపసర్పంచులు యారం రామ్ రెడ్డి,నరేందర్ రెడ్డి,మాజీ ఉపసర్పంచ్ మన్మధ రెడ్డి,నాయకులు పల్లటి క్రిష్ణయ్య,వేములనర్వ మల్లేష్, మురళి, సుందరపూర్ గ్రామ పెద్దలు వార్డు సభ్యులు, మండల బీఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# రేషన్ కార్డుకు ఏ నాయకుడి సిఫారసు అవసరం లేదు

**-మీ సేవలో దరఖాస్తు చేసుకుంటే చాలు..**

**-షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్**

**-షాద్‌నగర్ పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించిన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ**



**రంగారెడ్డి జిల్లా బ్యూరో, సెప్టెంబర్ 06 (జర్నలిస్ట్ డైరీ) :** అర్హత కలిగిన ప్రతి పేద కుటుంబానికి రేషన్ కార్డులు అందించడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని షాద్‌నగర్ ఎమ్మెల్యే, ప్రభుత్వ రంగ సంస్థల కమిటీ చైర్మన్ వీర్లపల్లి శంకర్ అన్నారు. రేషన్ కార్డు కోసం ఏ పార్టీ నాయకుడి సిఫారసు అవసరం లేదని, అర్హులైన ప్రతి ఒక్కరూ మీ సేవ కేంద్రంలో దరఖాస్తు చేసుకుంటే అధికారుల పరిశీలన అనంతరం నిబంధనల ప్రకారం రేషన్ కార్డులు మంజూరు చేస్తారని స్పష్టం చేశారు. ప్రజలు దళారులను ఆశ్రయించి డబ్బులు చెల్లించాల్సిన అవసరం లేదని ఆయన పేర్కొన్నారు. షాద్‌నగర్ పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించిన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ పాల్గొని లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి హయాంలో అర్హత ఉన్న పేద కుటుంబాలకు ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులు అందించి పేదల సంక్షేమానికి పెద్దపీట వేశారని గుర్తు చేశారు. అదే స్ఫూర్తితో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం అర్హులైన ప్రతి పేద కుటుంబానికి రేషన్ కార్డులతో పాటు ఇందిరమ్మ ఇళ్లను అందిస్తోందన్నారు.

**గత ప్రభుత్వంపై ఘాటు విమర్శలు**

గత కేసీఆర్ ప్రభుత్వ హయాంలో పేదలకు నాణ్యత లేని మక్కిన బియ్యం పంపిణీ చేసి వారి ఆత్మగౌరవాన్ని దెబ్బతీశారని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ తీవ్రంగా విమర్శించారు. పేదలకు అందాల్సిన నాణ్యమైన బియ్యం విషయంలో నిర్లక్ష్యం వహించడంతో వారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని అన్నారు. ఆ పరిస్థితిని కొందరు దళారులు తమకు అనుకూలంగా మలుచుకుని పేదల నుంచి దొడ్డు బియ్యాన్ని తక్కువ ధరకు కొనుగోలు చేసి, పాలిష్ చేయించి సన్నబియ్యం పేరుతో తిరిగి అధిక ధరలకు విక్రయించారని ఆరోపించారు. పేదలకు అందాల్సిన సంక్షేమాన్ని కూడా దళారుల చేతుల్లో పెట్టిన గత ప్రభుత్వ విధానాలకు భిన్నంగా, తమ ప్రభుత్వం సంక్షేమ పథకాలను నేరుగా అర్హులైన లబ్ధిదారులకు చేరేలా చర్యలు తీసుకుంటోందని తెలిపారు. స్మార్ట్ రేషన్ కార్డుల ద్వారా రేషన్ పంపిణీలో మరింత పారదర్శకత, జవాబుదారీతనం పెరుగుతుందని అన్నారు.

పేదలకు కూడు, గూడు, నీడ కల్పించడమే ప్రభుత్వాల అసలు బాధ్యత అని పేర్కొన్న ఎమ్మెల్యే, పేదల జీవన ప్రమాణాలను మెరుగుపరచడమే ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యమన్నారు. అర్హత ఉన్న ఏ ఒక్క కుటుంబం కూడా ప్రభుత్వ సంక్షేమ పథకాలకు దూరం కాకుండా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. రేషన్ కార్డు కోసం ఎవరైనా నాయకుల సిఫారసులు, దళారుల మధ్యవర్తిత్వం అవసరం లేదని మరోసారి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బసవేశ్వర్, వైస్ చైర్మన్ అందే మోహన్, మార్కెట్ కమిటీ చైర్మన్ సులోచన కృష్ణారెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాబర్ ఖాన్, ఎమ్మార్వో నాగయ్య, మున్సిపల్ కమిషనర్ సునీతా రెడ్డి, కౌన్సిలర్లు, కో-ఆప్షన్ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## బ్యాడ్మింటన్ లో నేషనల్స్ కు ఎంపికైన వాసని కాలనీ చెందిన గంప శ్రీనిక

**జర్నలిస్ట్ డైరీ, అర్కోవురం:** మహేశ్వరం ఎయోజకవర్గ అర్కపురం డివిజన్ వాసవి కాలనీకి చెందిన గంప శ్రీనిక తెలంగాణ రాష్ట్ర బ్యాడ్మింటన్ శాంనీయస్తో వత్తా కాటి వచ్చేనెల కత్తీస్ గడ్ రాష్ట్రంలో జరిగే నేషకల్స్ కు అర్హత సాధించింది. నగరంలోని పుల్లెల గోపీకంద్ అకాడమీతో జరిగిన అండర్-11 బాలికల విభాగంలో డబుల్స్ లో ప్రథమ స్థావం (బంగారు పతకం) సాధించడంతో పాటు, సింగిల్స్లో ద్వితీయ స్థానం (వెండి పతకం) సాధించి అద్భుత ప్రతిభ కనబరిచింది. ఈ విజయంతో జాతీయ స్థాయితో తెలంగాణ తరపున ప్రాతివిధ్యం వహింతమంది. హర్ష స్పోర్ట్స్ మేనేజ్ మెంట్ ఆధ్వర్యంలో ఆమె కోచ్ వికాస్ హర్ష అందించిన శిక్షణ, మార్గదర్శకత్వం కృషి గంప శ్రీనిక విజయానికి ఎంతో కీలకంగా ఎతిచాయి. జాతీయ స్థాయిలోనూ గంప శ్రీనిక విజయాలు సాధించి తెలంగాణకు మంచి పేరు తీసుకురావాలని పలువురు ఆకాంక్షించారు. ఈ సందర్భంగా జాతీయ స్థాయి ఛాంపియన్ షిప్కు ఎంపికైన శ్రీకనం కాలనీ వాసులు పలువురు ఆదివారం అభినందించారు.



# బీఆర్ఎస్ హయాంలో పల్లె ప్రగతితో అభివృద్ధి..

-కాంగ్రెస్ పాలనలో పల్లెల విధ్వంసం

-షాద్ నగర్ మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్

-కాంగ్రెస్ 1000 రోజుల పాలనపై నందిగామలో బీఆర్ఎస్ నిరసన

-అంబేద్కర్ విగ్రహానికి, గాంధీ విగ్రహనికి కాంగ్రెస్ బాకీ కార్డుల అందజేత

-పల్లెల విధ్వంసం.. పడకేసిన పారిశుద్ధ్యంపై ప్రజల్లో చైతన్యం



**రంగారెడ్డి జిల్లా బ్యూరో, సెప్టెంబర్ 06 (జర్నలిస్ట్ డైరీ) :**
కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 1000 రోజులు పూర్తవుతున్న సందర్భంగా ఆ పార్టీ ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలు, వాటి అమలు తీరును ప్రజల ముందుంచేందుకు బీఆర్ఎస్ చేపట్టిన 'కాంగ్రెస్ బాకీ కార్డుల' పంపిణీ కార్యక్రమంలో భాగంగా ఈరోజు నందిగామ గ్రామంలో మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ ఇంటింటికీ తిరిగి బాకీ కార్డులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమం కేవలం నిరసనకే పరిమితం కాకుండా, కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను ప్రజలకు గుర్తుచేసి, ఆ హామీల్లో ఏవి అమలయ్యాయి.. ఏవి ఇంకా బాకీ ఉన్నాయి అనే విషయాలను ప్రజలకు వివరించడమే ప్రధాన ఉద్దేశం అని అంజయ్య యాదవ్ తెలిపారు. ఈ సందర్భంగా గ్రామంలోని పారిశుద్ధ్య పరిస్థితులను పరిశీలించిన ఆయన.. కాంగ్రెస్ పాలనలో పల్లెల్లో పారిశుద్ధ్య వ్యవస్థ పూర్తిగా నిర్వీర్యమైందని, చెత్త సేకరణ, డ్రైనేజీ, పరిసరాల పరిశుభ్రత వంటి కనీస సౌకర్యాల విషయంలో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో చేపట్టిన 'పల్లె ప్రగతి' కార్యక్రమంతో గ్రామాల రూపురేఖలను మార్చి, పారిశుద్ధ్యం, హరితహారం, మౌలిక వసతులు, గ్రామ అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇచ్చామని గుర్తు చేశారు. ప్రతి గ్రామాన్ని పరిశుభ్రంగా, పచ్చదనంతో, ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో అప్పటి ప్రభుత్వం నిరంతరం పనిచేసిందన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా కాలయాపన చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రజల తరఫున ప్రశ్నించడమే 'కాంగ్రెస్ బాకీ కార్డుల' కార్యక్రమం లక్ష్యమని అంజయ్య యాదవ్ స్పష్టం చేశారు. రాబోయే రోజుల్లో నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలో ఈ కార్యక్రమాన్ని విస్తృతంగా నిర్వహించి, కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్తామని తెలిపారు. పల్లెల అభివృద్ధి కోసం బీఆర్ఎస్ హయాంలో చేసిన పనులకు, ప్రస్తుత కాంగ్రెస్ పాలనలో పల్లెల్లో నెలకొన్న దుస్థితికి మధ్య ఉన్న తేడాను ప్రజలకు వివరిస్తూ.. హామీల అమలుపై ప్రభుత్వాన్ని నిలదీసే ప్రజా ఉద్యమంగా ఈ కార్యక్రమాన్ని ముందుకు తీసుకెళ్తామని నాయకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు వంకాయల నారాయణరెడ్డి, మాజీ సర్పంచుల సంఘం అధ్యక్షులు వెంకట్ రెడ్డి, మాజీ జడ్పీ వైస్ చైర్మన్ ఈట గణేష్, మాజీ పీఏసీఎస్ చైర్మన్ విఠల్, సర్పంచ్ జెట్ట కుమార్, మాజీ సర్పంచ్ రాజు, మాజీ ఎంపీటీసీ సురేష్, నాయకులు కొమ్ము వెంకటయ్య, ఎర్రగారి స్వామి, ఎర్ర శ్రీనివాస్, పెంటయ్య, కుమార్ గౌడ్, రాంబాబు తదితరులు, గ్రామ బీఆర్ఎస్ శ్రేణులు పాల్గొన్నారు.

# ప్రజల అభిరుచులకు అనుగుణంగా 'దశ 10 ఫుడ్ పార్క్' ఏర్పాటు అభినందనీయం

-షాద్‌నగర్‌లో ఘనంగా ప్రారంభించిన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

-హాజరైన మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్ వైస్ చైర్మన్ అందె మోహన్, తదితర కౌన్సిలర్లు




**రంగారెడ్డి జిల్లా బ్యూరో, సెప్టెంబర్ 06 (జర్నలిస్ట్ డైరీ) :**
పట్టణ ప్రజల అభిరుచులు, అవసరాలకు అనుగుణంగా ఆధునిక వసతులతో 'దశ 10 ఫుడ్ పార్క్' ఏర్పాటు చేయడం అభినందనీయమని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. పాత జడ్చర్ల రోడ్డులో మధురపూర్ భార్గవ్ గౌడ్ ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన 'దశ 10 ఫుడ్ పార్క్' గ్రాండ్ ఓపెనింగ్ కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి, రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ షాద్‌నగర్ పట్టణం శరవేగంగా అభివృద్ధి చెందుతోందని, పట్టణ అభివృద్ధికి అనుగుణంగా ప్రజలకు మెరుగైన సేవలు, సౌకర్యాలు అందుబాటులోకి రావడం సంతోషకరమన్నారు. ఫుడ్ పార్క్‌లో ప్రజలకు నాణ్యమైన, రుచికరమైన ఆహారాన్ని అందించాలని నిర్వాహకులను కోరారు. పరిశుభ్రత, నాణ్యత విషయంలో రాజీ పడకుండా వినియోగదారుల విశ్వాసాన్ని పొందాలని సూచించారు. ఫుడ్ పార్క్ ద్వారా స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు లభించడంతో పాటు, వ్యాపారపరంగా మంచి విజయాన్ని సాధించాలని ఆకాంక్షిస్తూ నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలిపారు.ఫుడ్ పార్క్‌లోని పలు విభాగాలను ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ప్రారంభించగా, మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్, వైస్ చైర్మన్ అందే మోహన్‌తో పాటు జ్ఞాన ప్రసూన--మాధవరెడ్డి దంపతులు టిఫిన్ సెంటర్‌ను లాంఛనంగా ప్రారంభించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మహమ్మద్ అలీ ఖాన్ బాబర్, సీనియర్ నేత కృష్ణారెడ్డి, విశ్వహిందూ పరిషత్ నేత బండారు రమేష్, సీనియర్ జర్నలిస్ట్ కె.పి., ఆర్ఎస్ఎస్ ప్రముఖ్ నాగిళ్ల కుమార్, బీజేపీ నేత చెంది మహేందర్ రెడ్డి, కృష్ణ మహేష్, ప్రజాసేన ఆల్ ఇండియా అధ్యక్షులు ఎండి ఖాదర్ గోరి, కౌన్సిలర్లు ప్రవీణ్ కుమార్, పెంటయ్య, బచ్చలి నరేష్, రాజు నాయక్, మురళీమోహన్, అప్పి, సింగిల్ విండో వైస్ చైర్మన్ తుపాకుల శేఖర్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బాలరాజ్ గౌడ్, పార్టీ అధ్యక్షులు రాయికల్ శ్రీనివాస్, పురుషోత్తం రెడ్డి, నల్లమోని శ్రీధర్, కాంగ్రెస్ మైనార్టీ నాయకులు ముబారక్ అలీ ఖాన్, కొత్తపేట ఉస్మాన్ తదితరులు పాల్గొన్నారు.
పట్టణ ప్రజలు, వ్యాపారవేత్తలు, నాయకులు, మిత్రులు పెద్ద సంఖ్యలో హాజరై నిర్వాహకులు మధురపూర్ భార్గవ్ గౌడ్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

# ప్రజల ఆరోగ్యానికి ఓపెన్ జిమ్ దోహదం

- ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుదీర్ రెడ్డి

**జర్నలిస్ట్ డైరీ, నాగోలు:**
ప్రజల ఆరోగ్య పరిరక్షణకు ఓపెన్ జిమ్లు ఎంతగానో దోహదపడతాయని ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి అన్నారు. నాగోలు డివిజన్ పరిధిలోని మల్లికార్జున హిల్స్ హౌసింగ్ సొసైటీలో నూతనంగా ఏర్పాటు చేసిన ఓపెన్ ఓపెన్ జిమ్ ను ఆదివారం ఎమ్మెల్యే సుదీర్ రెడ్డి ప్రారంబించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలనీల్లో ఓపెన్ జిమ్లు ఏర్పాటు ద్వారా చిన్నారులు. యువత, మహిళలు, వద్దులు నిత్యం వ్యాయామం చేసుకునే అవకాశం కలుగుతుందన్నారు. ప్రజలు ఆరోగ్యంగా ఉంటేనే కుటుంబాలు. సమాజం అభివద్ధి చెందుతాయని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ వ్యాయామాన్ని తమ దైనందిన జీవితంలో భాగం చేసుకొని ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు. గతంలో మల్లికార్జున హిల్స్‌లోని పార్కు స్థలాన్ని ఆక్రమించుకున్నారు. దీంతో కాలనీ వాసులు హైడ్రాలో ఫిర్యాదు చేయగా హైడ్రా కమిషనర్ రంగనాథ్ స్పందించి పార్క్ స్థలానికి కాపాడి బోర్డ్ ఏర్పాటు చేసి జీహెచ్ఎంసీ అందజేసిన విషయం ఎమ్మెల్యే తెలియజేశారు. ఈసందర్భంగా పార్క్ స్థలానికి కాపాడిన కాలనీ వాసులను సుదీర్ రెడ్డి అభినందించారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా కాలనీల్లో పార్కులు, ఓపెన్ జిమ్లు, ఇతర మౌలిక సదుపాయాల అబివద్ధికి ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. అందుబాటులోకి వచ్చిన ఓపెన్ జిము కాలనీవాసులు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే కోరారు. నాగోలు మాజీ కార్పొరేటర్ చెర్కు సంగీత ప్రశాంత్ గౌడ్, బిజెపి ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు చింతల సురేందర్ యాదవ్, బీఆర్ఎస్ నాగోలు డివిజన్ అధ్యక్షులు తూర్పటి చిరంజీవి. మల్లికార్జున హిల్స్ అసోసియేషన్ నాయకులు పి. యాదయ్య. ప్రమోద కు మార్, ఎం. మదుసూదన్, యాదగ్రావు, లక్ష్మీనారాయణ, రవీందర్, రామచంద్రరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.




నాగోలు మల్లికార్జున హిల్స్ లో ఓపెన్ జీమ్ ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి..

# లక్షల గాజులతో ప్రత్యేంగిరా అమ్మవారికి ప్రత్యేక పూజ సేవ..!

వైభవంగా రంగు రంగుల గాజులతో అమ్మవారికి అలంకరణ..






**జర్నలిస్ట్ డైరీ: ఆర్కేపురం:**
ఆర్కేపురంలోని కుర్తాళం పీఠం వారాహి, దశమహావిద్య సమేత, ప్రత్యంగిరా పరమేశ్వరి మందిరములో ఆదివారం అమ్మవారికి లక్ష గాజుల పూజ సేవ ఘనంగా నిర్వహించారు. ఆలయంలో కొలువై ఉన్న ప్రత్యంగిరా దేవి, వారాహి దేవి. దశమహావిద్య దేవతలు రంగురంగుల గాజులతో అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణం అంతా రంగురంగుల గాజులతో ఆలంకరణ చేశారు. ఈ సందర్భంగా ఆలయ సెక్రెటరీ మునిపల్లె శ్రీనివాస్ మాట్లాడుతూ పీఠాధిపతులు శ్రీ సిద్దేశ్వరానంద భారతి మహాస్వామి పర్యవేక్షణలో ఉత్తరాదికారి దత్తేశ్వరానంద భారతి స్వామి వారి ఆశీస్సులతో ప్రతి శ్రావణ మాసంలో లక్ష పుష్పార్చన, లక్ష గాజులు పూజ సేవ జరుగుతుందని తెలిపారు. రంగుల గాజులతో అమ్మవారికి అలంకరించడం వల్ల స్త్రీలకు దీర్ఘ సుమంగళీ ప్రాప్తి, కుటుంబంలో ఐశ్వర్యం లబిస్తుందని తెలిపారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారిని భక్తులు దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో సాయికుమార్ శర్మ. నిఖిల్ శర్మ, హేమంత్ శర్మ, గోపాలకృష్ణ, మునిపల్లె సువర్ణలత, అరుణ. వెన్నంపల్లి జగన్మోహన్ శర్మ, బలరాం శర్మ, శ్రీకాంత్ శర్మ, శ్రీనివాసరావు, కృష్ణవేణి, రమాదేవి. తదితరులు పాల్గొన్నారు.
ఖైటప్- లక్ష గాజుల అలంకరణలో ప్రత్యంగిరా పరమేశ్వరి అమ్మవారు..
-ప్రత్యంగిరా పరమేశ్వరి అమ్మవారిని దర్శించుకున్న ఆలయ సెక్రెటరీ మునిపల్లె శ్రీనివాస్ తదితరులు..

# ఏపీ కాంగ్రెస్‌కు కొత్త ఇన్‌ఛార్జ్.. పీవీ మోహన్‌కు బాధ్యతలు

-ప్రస్తుత ఇన్‌ఛార్జ్ మాణికం ఠాగూర్‌పై వేటు

-ఏపీకి చెందిన సిరివెళ్ల ప్రసాద్‌కు మహారాష్ట్ర ఇన్‌ఛార్జ్ బాధ్యతలు

-నియామకాలను ప్రకటించిన ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్



**అమరావతి, ఏపీ బ్యూరో, జర్నలిస్ట్ డైరీ :**
అఖిల భారత కాంగ్రెస్ కమిటీ (ఏఐసీసీ) పార్టీలో పలు కీలక మార్పులు చేపట్టింది. ఇందులో భాగంగా ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌ఛార్జిగా కర్ణాటకకు చెందిన ఎమ్మెల్సీ పీవీ మోహన్‌ను నియమించింది. ఇప్పటివరకు ఈ బాధ్యతల్లో ఉన్న తమిళనాడు ఎంపీ మాణికం ఠాగూర్‌ను తప్పించి, ఆయన స్థానంలో మోహన్‌కు బాధ్యతలు అప్పగించింది.
ఏఐసీసీ సంస్థాగత వ్యవహారాల ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ శనివారం రాత్రి ఈ నియామకాలకు సంబంధించిన అధికారిక ప్రకటన విడుదల చేశారు.ఈ క్రమంలో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన సీనియర్ నేత సిరివెళ్ల ప్రసాద్‌కు మహారాష్ట్ర కాంగ్రెస్ ఇన్‌ఛార్జ్ బాధ్యతలు అప్పగించడం ప్రాధాన్యత సంతరించుకుంది. లోక్‌సభ ఎన్నికలకు ముందు పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేసే దిశగా ఈ మార్పులు చేపట్టినట్లు తెలుస్తోంది

# సీఎం ఇంటి వద్ద ఉద్యోగ సంఘాల నేతల మధ్య ఘర్షణ...

## బాహాబాహీకి దిగిన నేతలు

-ఏపీ జేఏసీ, ప్రభుత్వ ఉద్యోగ సంఘం మధ్య తోపులాట

-సీఎం ఇంటి వద్ద ఉద్యోగ సంఘాల నేతల రచ్చ..

-ఒకరి ప్రెస్ మీట్‌ను మరొకరు అడ్డుకోవడంతో వివాదం

-ఇరు వర్గాల పోటాపోటీ నినాదాలతో ఉద్రిక్తత

-సీనియర్ నేతల జోక్యంతో సద్దుమణిగిన గొడవ



**అమరావతి,ఏపీ బ్యూరో, జర్నలిస్ట్ డైరీ :**
అమరావతిలో ఉద్యోగ సంఘాల నేతల మధ్య విభేదాలు మరోసారి భగ్గుమన్నాయి. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుతో సమావేశం ముగిసిన అనంతరం, ఉండవల్లిలోని సీఎం నివాసం వెలుపల ఇరు సంఘాల నేతలు బాహాబాహీకి దిగారు. ఏపీ జేఏసీ, ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం నాయకుల మధ్య చోటుచేసుకున్న తీవ్ర వాగ్వివాదం, తోపులాటతో అక్కడ ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి.

**సీఎంతో భేటీ అనంతరం వివాదం...**
సీఎంతో భేటీ అనంతరం ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు సూర్యనారాయణ మీడియాతో మాట్లాడుతుండగా.. అదే సమయంలో ఏపీ జేఏసీ నాయకులు అక్కడికి చేరుకుని పోటాపోటీగా నినాదాలు చేశారు. సూర్యనారాయణ ప్రసంగాన్ని అడ్డుకోవడంతో వివాదం మొదలైంది. ఇది కాస్తా ఇరువర్గాల మధ్య మాటామాట పెరిగి పరస్పరం తోపులాటకు దారితీసింది.
సీనియర్ నాయకులు జోక్యంతో సద్దుమణిగిన వివాదం
ఈ క్రమంలో తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసిన సూర్యనారాయణ, "నువ్వు అరిచినంతసేపు ఇక్కడి నుంచి కదలను. ఏం చేసుకుంటావో చేసుకో. దశాబ్దాలుగా నేను ఉద్యోగ సంఘాల్లో ఉన్నాను" అంటూ జేఏసీ నేతలపై మండిపడ్డారు. పరిస్థితి మరింత ఉద్రిక్తంగా మారుతుండటంతో ఏపీ జేఏసీ ఛైర్మన్ విద్యాసాగర్‌తో పాటు ఇతర సీనియర్ నాయకులు జోక్యం చేసుకున్నారు. ఇరువర్గాలకు సర్దిచెప్పడంతో వివాదం సద్దుమణిగింది

## ఏపీలో 28 జడ్పీలు.. పునర్వ్యవస్థీకరణకు ప్రభుత్వ ఉత్తర్వులు

**-రాష్ట్రంలో 13 నుంచి 28కి పెరిగిన జిల్లా పరిషత్‌లు**

**-కొత్త జడ్పీల పరిధిలోకి 660 మండల పరిషత్‌లు**

**-అదనంగా 15 సీఈఓ, 15 డిప్యూటీ సీఈఓ పోస్టుల ఏర్పాటు**

**-సెప్టెంబర్ 24 తర్వాత అమల్లోకి రానున్న పునర్వ్యవస్థీకరణ**



**అమరావతి, ఏపీ బ్యూరో, జర్నలిస్ట్ డైరీ :** రాష్ట్రంలో జిల్లా ప్రజాపరిషత్‌ల (జడ్పీపీ) పునర్వ్యవస్థీకరణకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ప్రస్తుతం ఉన్న 13 జడ్పీల స్థానంలో కొత్తగా 28 జిల్లా పరిషత్‌లను ఏర్పాటు చేస్తూ శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ రెండు వేర్వేరు జీవోలను విడుదల చేసింది.కొత్తగా ఏర్పాటయ్యే ఈ 28 జడ్పీల పరిధిలో 660 మండల ప్రజా పరిషత్‌లు
కొత్తగా ఏర్పాటయ్యే ఈ 28 జడ్పీల పరిధిలో రాష్ట్రవ్యాప్తంగా 660 మండల ప్రజాపరిషత్‌లు (ఎంపీపీ) ఉంటాయి. వీటి కార్యకలాపాల నిర్వహణ కోసం ప్రభుత్వం అదనంగా 15 సీఈఓ, 15 డిప్యూటీ సీఈఓ పోస్టులను సృష్టించింది. మిగిలిన మినిస్టీరియల్, సహాయక సిబ్బందిని ప్రస్తుతం ఉన్నవారి నుంచే హేతుబద్ధీకరించి కొత్త జడ్పీలకు కేటాయించనున్నారు.

**సెప్టెంబరు 24వ తేదీతో ముగియనున్న 13 జిల్లా పరిషత్‌ల పదవీకాలం..**

ప్రస్తుతం కొనసాగుతున్న 13 జిల్లా పరిషత్‌ల పదవీకాలం ఈ నెల సెప్టెంబరు 24వ తేదీతో ముగియనుంది. ఆ తర్వాత కొత్త జిల్లాల భౌగోళిక స్వరూపానికి అనుగుణంగా ఈ పునర్వ్యవస్థీకరణ ప్రక్రియ అమల్లోకి వస్తుంది. ప్రతి జిల్లాకు ఒక జడ్పీ చొప్పున పనిచేస్తుంది. భవిష్యత్తులో ఏదైనా మండల పరిషత్ పునర్వ్యవస్థీకరణకు గురైతే, అందుకు అనుగుణంగా జడ్పీ పరిధిలోనూ మార్పులు జరుగుతాయని ప్రభుత్వం తన ఉత్తర్వుల్లో స్పష్టం చేసింది.

## అట్టడుగు వర్గాలకు న్యాయం జరగాలంటే దండోరా ఉద్యమం కొనసాగాలి రాగల్ల ఉపేందర్ మాదిగ

**జర్నలిస్టు డైరీ, కొత్తపేట:** అట్టడుగు వర్గాలకు న్యాయం జరగాలంటే దండోరా ఉద్యమం కొనసాగాలని ఎమ్మార్పీఎస్ రంగారెడ్డి జిల్లా ఇంచార్జి రాగల్ల ఉపేందర్ మాదిగ అన్నారు. ఆదివారం కొత్తపేట కమ్యూనిటీ హాల్‌లో ఎమ్ఎస్పి సీనియర్ నాయకులు బత్తిని సుధాకర్ మాదిగ అధ్యక్షతన ఎమ్మార్పీఎస్, ఎమ్ఎస్పి అనుబంధ విభాగాల సరూర్‌నగర్, హయత్‌నగర్ మండలాల నూతన కమిటీల ఎన్నికల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఎమ్మార్పీఎస్ నియోజకవర్గ ఇంచార్జి కొమ్ము రాజశేఖర్ మాదిగ స్వాగత ఉపన్యాసం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ రంగారెడ్డి జిల్లా ఇంచార్జి రాగల్ల ఉపేందర్ మాదిగ మాట్లాడుతూ సమాజంలో నెలకొన్న సామాజిక, ఆర్థిక, రాజకీయ అసమానతలను రూపుమాపి సమానత్వాన్ని సాధించడమే ఎమ్మార్పీఎస్ ప్రధాన ఆశయమని, అట్టడుగు వర్గాలకు న్యాయం లభించాలంటే దండోరా ఉద్యమం మరింత బలోపేతం కావాల్సిన అవసరం ఉందని అన్నారు. ఎమ్ఎస్పి సీనియర్ నాయకులు బత్తిని సుధాకర్ మాదిగ అధ్యక్షతన పీడిత, అణగారిన వర్గాల గొంతుకగా ఎమ్మార్పీఎస్ ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడుతోందన్నారు. ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ చట్టబద్ధత సాధన కోసం ప్రారంభమైన ఉద్యమం తన పరిధిని విస్తరించుకొని అనేక సామాజిక సమస్యల పరిష్కారానికి పోరాటాలు చేసిందని తెలిపారు. ఎమ్మార్పీఎస్ పోరాటాల ఫలితంగానే ఎస్సీ, ఎస్టీ ఉద్యోగులకు ప్రమోషన్లలో రిజర్వేషన్లు, ఆరోగ్యశ్రీ, ఆసరా పెన్షన్లు, మనిషికి ఆరు కిలోల బియ్యం వంటి సంక్షేమ కార్యక్రమాలు ప్రజలకు అందుతున్నాయని ఆయన పేర్కొన్నారు. అణగారిన వర్గాలకు అన్ని రంగాల్లో న్యాయం జరగాలంటే ఎమ్మార్పీఎస్ ఉద్యమాన్ని మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. అస్తిత్వం, ఆత్మగౌరవం, హక్కుల సాధన కోసం సాగుతున్న ఉద్యమంలో చదువుకున్న యువత పెద్ద





సంఖ్యలో భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు. యువతరం ఉద్యమంలోకి వచ్చి సమాజ హితం కోసం పనిచేయాలని కోరారు. మందకృష్ణ మాదిగ నాయకత్వంలో గత 32 ఏళ్లుగా దండోరా ఉద్యమం లక్షలాది మందిని కదిలించే బలమైన సామాజిక ఉద్యమంగా కొనసాగుతోందని అన్నారు. దేశంలో అనేక కుల ఉద్యమాలు పుట్టుకొచ్చినా లక్ష్య సాధన వరకు కొనసాగలేకపోయాయని, అయితే ఎమ్మార్పీఎస్ మాత్రం సజీవంగా నిలిచి తన లక్ష్య సాధన దిశగా ముందుకు సాగుతోందన్నారు. ప్రస్తుతం ప్రజా సమస్యలను గుర్తించి బలమైన ప్రజా పోరాటాలను నిర్మిస్తూ, దోపిడీ, వివక్ష, పీడన, అసమానతలు లేని నూతన సమాజ నిర్మాణం కోసం ఉద్యమం కొనసాగుతోందని తెలిపారు.అనంతరం సరూర్‌నగర్, హయత్‌నగర్ మండలాలకు ఎమ్మార్పీఎస్, ఎమ్ఎస్పి నూతన కమిటీలను ఎన్నుకున్నారు. ఎమ్మార్పీఎస్ సరూర్‌నగర్ మండల కమిటీ అధ్యక్షులుగా ఆగుపోగు సునీల్ కుమార్ మాదిగ, అధికార ప్రతినిధిగా సూరిగిరి బీషన్న మాదిగ, ప్రధాన కార్యదర్శిగా ధర్మారపు సైదులు మాదిగ, ఉపాధ్యక్షులుగా కమ్మలపల్లి శ్రీధర్, గడామూరు సుమన్, కోశాధికారిగా పల్లెర్ల నాగరాజు. ఎమ్ఎస్పి సరూర్‌నగర్ మండల కమిటీ అధ్యక్షులుగా గండికోట భీమారాజు వద్దెర,
అధికార ప్రతినిధిగా దేరంగుల క్రాంతి కుమార్, మాదిగ ప్రధాన కార్యదర్శిగా ఆకుపోగు మౌలాలి, మాదిగ యాచారం లక్ష్మి నర్సయ్య, మాదిగ ఉపాధ్యక్షులుగా గోవి శివ,
కోశాధికారిగా మంద నర్సింహా,
కార్యదర్శిగా రేపల్లె లోకేష్, ఎమ్మార్పీఎస్ హయత్‌నగర్ మండల కమిటీ
అధ్యక్షులుగా కొమ్ము శివ మాదిగ,
అధికార ప్రతినిధిగా కొంగరి జానకి రామ్ మాదిగ, ప్రధాన కార్యదర్శులుగా ఇరుగు వినయ్ కుమార్ మాదిగ, ఇరుగు లింగరాజు మాదిగ, ఉపాధ్యక్షులుగా కొమ్ము మల్లేష్ మాదిగ, దుబ్బాక సతీష్ మాదిగ, ఎమ్ఎస్పి హయత్‌నగర్ మండల కమిటీ అధ్యక్షులుగా కొంగరి నవీన్ మాదిగ, అధికార ప్రతినిధిగా ఇరుగు సుధాకార్ మాదిగ, ప్రధాన కార్యదర్శిగా ఇరుగు సురేష్ మాదిగ, ఉపాధ్యక్షులుగా జొన్నం ఆదమ్ మాదిగ, ఇరుగు సుధాకర్ మాదిగ ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో ఎమ్ఎస్పి ఎల్బీనగర్ నియోజకవర్గం ఇంచార్జి యర్ర రవీందర్ మాదిగ, ఎమ్మార్పీఎస్ కో-ఇంచార్జి సతీష్ మాదిగ, ఎమ్మార్పీఎస్ మాజీ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి డి. ప్రకాష్ మాదిగ, ఎమ్ఎస్పి సీనియర్ నాయకులు హేమంత్ గుప్తా, చంపాపేట డివిజన్ నాయకులు ఎమ్ఎస్పి డివిజన్ ఇంచార్జి మల్లెపోగు రాజు మాదిగ ఎమ్మెస్పీ సీనియర్ నాయకుడు నర్సింగ్ రావు మాదిగ నరసింహా మాదిగ మంద నరసింహా (దేవ) మాదిగ రవి మాదిగ చిరంజీవి మాదిగ తదితరులు పాల్గొన్నారు.

## నిర్వాసిత కుటుంబాలకు ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుంది

**-కలెక్టర్ ఎం. విజయ సునీత.**

**-వెలుగొండ ప్రాజెక్టు నిర్వాసితులకు ఇళ్ల పట్టాలు, నిత్యావసర వస్తువుల అందజేత**

**-కలెక్టరేట్‌లో ఇళ్ల పట్టాలు, 25 కేజీల బియ్యం, నిత్యావసర సరుకుల అందజేత.**



**మార్కాపురం జిల్లా బ్యూరో, జర్నలిస్ట్ డైరీ :** వెలుగొండ ప్రాజెక్ట్ ముంపు గ్రామైన సుంకేసుల గ్రామ నిర్వాసితులకు తోకపల్లి లేఔట్‌లో కేటాయించిన ఇళ్ల స్థలాలకు సంబంధించి పట్టాలు, నిత్యావసర సరుకులను జిల్లా కలెక్టర్ ఎం. విజయ సునీత అందజేశారు. స్థానిక మార్కాపురం కలెక్టరేట్ ప్రాంగణంలో ఆదివారం నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ పి. శ్రీనివాసులు, ఎర్రగొండపాలెం తెదేపా ఇన్‌చార్జ్ ఎరిక్షన్ బాబులతో కలిసి నిర్వాసిత కుటుంబాలకు ఇళ్ల పట్టాలతో పాటు, ఒక్కో కుటుంబానికి 25 కేజీల బియ్యం, ఉచిత నిత్యావసర వస్తువులు, చీర, గాజులు, పసుపు, కుంకుమలను లబ్ధిదారులకు అందజేశారు.

**నిర్వాసితుల సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుందన్న కలెక్టర్**

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... ప్రాజెక్టు నిర్మాణం కోసం భూములు, ఇళ్లను త్యాగం చేసిన నిర్వాసితుల సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుందని తెలిపారు. తోకపల్లి లేఔట్‌లో అన్ని మౌలిక సదుపాయాలతో కూడిన ఆదర్శ నివాస ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తున్నామని, నిర్వాసిత కుటుంబాలు త్వరితగతిన ఇళ్లను నిర్మించుకుని స్థిరపడాలని ఆకాంక్షించారు. నిర్వాసితులకు రావాల్సిన ప్రయోజనాలను సకాలంలో అందించేందుకు యంత్రాంగం నిరంతరం కృషి చేస్తోందని పేర్కొన్నారు. లబ్ధిదారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూస్తామని హామీ ఇచ్చారు. నిర్వాసితుల త్యాగాలు వెలకట్టలేనివని, వారి భవిష్యత్తుకు పూర్తి భరోసా కల్పిస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో డి ఆర్ ఓ వెంకటశివరామి రెడ్డి, సుంకేసుల గ్రామ నిర్వాసితులు, తదితరులు పాల్గొన్నారు.

## గత పాలకుల నిర్వాకం వల్ల పెళ్లిళ్లను కూడా వాయిదా వేసుకున్నాం

**-ఏపీ ఉద్యోగులు**

**-ఉద్యోగ సంఘాల డిమాండ్లకు సీఎం చంద్రబాబు సానుకూల స్పందన**

**-12వ పీఆర్సీ ఏర్పాటు, 2 డీఏల విడుదలకు గ్రీన్ సిగ్నల్**

**-పెన్షనర్ల ప్రయోజనాలు, పీఎస్‌యూ ఉద్యోగుల పదవీ విరమణ వయసుపై కీలక నిర్ణయాలు**

**-ప్రభుత్వానికి పూర్తి సహకారం అందిస్తామని ఉద్యోగుల హామీ**



**అమరావతి, ఏపీ బ్యూరో, జర్నలిస్ట్ డైరీ :** గత ప్రభుత్వ హయాంలో ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు పడ్డామని, కనీసం పీఎఫ్ లోన్లు కూడా మంజూరు చేయకుండా వేధించడంతో పిల్లల పెళ్లిళ్లు వాయిదా వేసుకోవాల్సిన దుస్థితి ఏర్పడిందని ప్రభుత్వ ఉద్యోగ సంఘాల నేతలు ఆవేదన వ్యక్తం చేశారు. అయితే, ముఖ్యమంత్రి చంద్రబాబు తమ సమస్యల పరిష్కారంపై సానుకూలంగా స్పందించి, కీలక హామీలకు ఆమోదం తెలపడంతో వారిలో హర్షం వ్యక్తమవుతోంది.శనివారం సీఎం క్యాంప్ కార్యాలయంలో జాయింట్ స్టాఫ్ కౌన్సిల్‌లోని ఉద్యోగ సంఘాల నేతలతో ముఖ్యమంత్రి చంద్రబాబు సమావేశమయ్యారు. ఈ భేటీలో ఉద్యోగులు ఎదుర్కొంటున్న పలు కీలక సమస్యలపై చర్చించారు. సుదీర్ఘకాలంగా పెండింగులో ఉన్న 12వ వేతన సవరణ సంఘం (పీఆర్సీ) ఏర్పాటుకు సీఎం ఆమోదం తెలిపారు. దీంతో పాటు, బకాయిపడ్డ నాలుగు డీఏలలో రెండింటిని వెంటనే విడుదల చేసేందుకు అంగీకరించారు. మరికొన్ని ముఖ్యమైన పెండింగ్ అంశాల పరిష్కారానికి కూడా ముఖ్యమంత్రి గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు.

**ఉద్యోగ సంఘాల నేతల హర్షం**

ఈ నిర్ణయాలపై ఉద్యోగ సంఘాల నేతలు హర్షం వ్యక్తం చేశారు. తమ సమస్యల పట్ల ప్రభుత్వం చూపిన సానుకూలతకు కృతజ్ఞతలు తెలిపారు. గత ప్రభుత్వం రిటైర్మెంట్ ఉద్యోగులకు మేలు చేసే అడిషనల్ క్వాంటం ఆఫ్ పెన్షన్‌ను రద్దు చేసిందని, దానిని కూటమి ప్రభుత్వం పునరుద్ధరించడంపై ధన్యవాదాలు తెలిపారు. ప్రభుత్వ రంగ సంస్థల్లో (పీఎస్‌యూ) పనిచేసే ఉద్యోగుల పదవీ విరమణ వయస్సును పెంచే నిర్ణయాన్ని కూడా స్వాగతించారు.

**రాష్ట్రాభివృద్ధికి, ప్రభుత్వానికి తమ సంపూర్ణ సహకారాన్ని అందిస్తామని హామీ**

రాష్ట్రం ప్రస్తుతం ఆర్థిక ఇబ్బందుల్లో ఉందని తాము అర్థం చేసుకోగలమని ఉద్యోగ సంఘాల నేతలు అన్నారు. ఈ క్లిష్ట పరిస్థితుల్లో రాష్ట్రాభివృద్ధికి, ప్రభుత్వానికి తమ సంపూర్ణ సహకారాన్ని అందిస్తామని వారు ముఖ్యమంత్రికి హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో ముఖ్యమంత్రి తో పాటు మంత్రులు పయ్యావుల కేశవ్, అనగాని సత్యప్రసాద్, ఆర్థిక శాఖకు చెందిన ఉన్నతాధికారులు పాల్గొన్నారు

## వెలిగొండ ప్రాజెక్టు ఫీడర్ కాలువలో పెను విషాదం.. పెళ్లికి ఒక్కరోజు ముందు వరుడు గల్లంతు

**-వెలిగొండ ప్రాజెక్టు ఫీడర్ కాలువలో ఇద్దరు యువకులు గల్లంతు**

**-గల్లంతైన వారిలో పెళ్లికి ఒక్కరోజు ముందు కాబోయే వరుడు**


**-ఈతకు వెళ్లి నీటి ప్రవాహ ఉద్ధృతికి కొట్టుకుపోయిన స్నేహితులు**

**-ప్రాజెక్టు ప్రారంభమయ్యాక ఐదు రోజుల్లో ఇది రెండో ప్రమాదం**

**మార్కాపురం, జిల్లా బ్యూరో, జర్నలిస్ట్ డైరీ ;** పెళ్లికి ఒక్కరోజు ముందు ఆ ఇంట్లో ఆనందం వెల్లివిరియాల్సింది. బంధుమిత్రుల సందడితో కళకళలాడాల్సిన పెళ్లి పందిరి మూగబోయింది. సరదాగా ఈతకు వెళ్లిన కాబోయే పెళ్లికొడుకు, అతని స్నేహితుడు వెలిగొండ ప్రాజెక్టు ఫీడర్ కాలువలో గల్లంతవ్వడంతో ఆ కుటుంబం కన్నీటి సంద్రంలో మునిగిపోయింది. ఈ హృదయవిదారక ఘటన మార్కాపురం జిల్లా పెద్దదోర్నాల మండలం కటకానిపల్లెలో చోటు చేసుకుంది.
వివరాల్లోకి వెళితే.. కటకానిపల్లె గ్రామానికి చెందిన పుష్పాల రాజ్‌కుమార్‌కు (23) ఈ నెల 7వ తేదీన వివాహం నిశ్చయమైంది. ఈ సందర్భంగా స్నేహితులు, బంధువులతో కలిసి మొత్తం ఏడుగురు పార్టీ చేసుకునేందుకు గ్రామ సమీపంలోని వెలిగొండ ఫీడర్ కాలువ వద్దకు వెళ్లారు. ఈ క్రమంలో రాజ్‌కుమార్, అతని స్నేహితుడు వినయ్‌కుమార్ (22), మరో స్నేహితుడు రాజు సరదాగా ఈత కొట్టేందుకు కాలువలోకి దిగారు.

**ఫీడర్ కాలువలో ఉద్ధృతంగా నీటి ప్రవాహం...**

ప్రస్తుతం శ్రీశైలం జలాశయం నుంచి నల్లమల సాగర్‌కు నీటిని విడుదల చేస్తుండటంతో ఫీడర్ కాలువలో నీటి ప్రవాహం అత్యంత ఉద్ధృతంగా ఉంది. ఈ విషయాన్ని అంచనా వేయకుండా నీటిలోకి దిగడంతో ముగ్గురూ ప్రవాహ వేగానికి అదుపుతప్పారు. వారిలో రాజు అతికష్టం మీద ఈదుకుంటూ ఒడ్డుకు చేరుకోగా, రాజ్‌కుమార్,



వినయ్‌కుమార్ నీటి ప్రవాహంలో కొట్టుకుపోయారు. స్నేహితుల కళ్ల ముందే వారు గల్లంతవ్వడంతో ఒడ్డున ఉన్నవారు షాక్‌కు గురయ్యారు.

**విగతాజీవిగా చూసి కన్నీరుమున్నీరుగా కుటుంబ సభ్యులు**

సమాచారం అందుకున్న కుటుంబ సభ్యులు ఘటనా స్థలానికి చేరుకుని కన్నీరుమున్నీరుగా విలపించారు. మరికొన్ని గంటల్లో పెళ్లిపీటలు ఎక్కాల్సిన కొడుకు విగతజీవిగా మారడంతో తల్లిదండ్రుల రోదనలు మిన్నంటాయి. బాధితుల ఫిర్యాదుతో యర్రగొండపాలెం సీఐ అజయ్‌కుమార్, పోలీసులు అక్కడికి చేరుకుని గజ ఈతగాళ్లతో గాలింపు చర్యలు చేపట్టారు.

**ఐదు రోజుల వ్యవధిలోనే ఇది రెండో ప్రమాదం...**

వెలిగొండ ప్రాజెక్టు ప్రారంభమైన ఐదు రోజుల వ్యవధిలోనే ఇది రెండో ప్రమాదం కావడం గమనార్హం. ప్రాజెక్టు ప్రారంభమైన తొలిరోజే సుంకేసుల - కలనూతల మార్గంలో బొలెరో వాహనం బోల్తా పడి ముగ్గురు గాయపడ్డారు. నీటి ప్రవాహం ఎక్కువగా ఉన్నందున కాలువ వద్దకు వెళ్లవద్దని పోలీసులు హెచ్చరికలు జారీ చేస్తున్నా, ప్రజలు పెడచెవిన పెట్టడం వల్లే ఇలాంటి ప్రమాదాలు జరుగుతున్నాయని అధికారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు'

# విజయవాడ హ్యుందాయ్ కార్ల షోరూంలో భారీ అగ్నిప్రమాదం

**-భవనం పైఅంతస్తులో ఒక్కసారిగా చెలరేగిన మంటలు**

**ఆదివారం సెలవు కావడం, సిబ్బంది లేకపోవడంతో తప్పిన ప్రాణనష్టం**

**-విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగానే ప్రమాదం జరిగిందని ప్రాథమిక నిర్ధారణ**

**-భారీగా ఆస్తి నష్టం జరిగి ఉంటుందని అంచనా**



**విజయవాడ,ఏపీ బ్యూరో, జర్నలిస్ట్ డైరీ :** విజయవాడ నగరంలోని ఆటోనగర్‌లో ఉన్న హ్యుందాయ్ కార్ల షోరూంలో భారీ అగ్నిప్రమాదం సంభవించింది. ఆదివారం నాడు షోరూంకు సెలవు కాగా, ఎవరూ లేకపోవడంతో పెను ప్రాణనష్టం తప్పింది. భవనం పైఅంతస్తు నుంచి పెద్ద ఎత్తున మంటలు, దట్టమైన పొగ వ్యాపించడంతో స్థానికంగా తీవ్ర కలకలం రేగింది.

వివరాల్లోకి వెళితే, ఆటోనగర్‌లోని హ్యుందాయ్ షోరూం భవనం పైభాగం నుంచి ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. క్షణాల్లోనే మంటలు భవనం పైఅంతస్తును పూర్తిగా చుట్టుముట్టాయి. దట్టమైన పొగ ఆ ప్రాంతమంతా కమ్ముకోవడంతో సమీప నివాసితులు, వాహనదారులు తీవ్ర భయాందోళనలకు గురయ్యారు. వెంటనే స్థానికులు అగ్నిమాపక శాఖకు, పోలీసులకు సమాచారం అందించారు.

**ఫైర్ ఇంజన్ల సాయంతో మంటలు అదుపులోకి..**

హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది పలు ఫైర్ ఇంజన్ల సాయంతో మంటలను అదుపులోకి తెచ్చేందుకు శ్రమించారు. ఆదివారం సెలవు కావడంతో షోరూంలో సిబ్బంది గానీ, వినియోగదారులు గానీ ఎవరూ లేరు. ఇదే రోజు పనిదినం అయ్యుంటే ఊహించని స్థాయిలో ప్రాణనష్టం జరిగి ఉండేదని అధికారులు అభిప్రాయపడ్డారు

**విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగానే ప్రమాదం..?**

భవనం పైఅంతస్తులో సంభవించిన విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగానే ఈ ప్రమాదం జరిగి ఉండవచ్చని అధికారులు ప్రాథమికంగా అంచనా వేస్తున్నారు. ప్రమాదం కారణంగా భారీగా ఆస్తి నష్టం జరిగినట్లు తెలుస్తోంది. మంటలు పూర్తిగా అదుపులోకి వచ్చిన తర్వాత నష్టంపై పూర్తిస్థాయిలో అంచనా వేయనున్నారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని, అగ్నిమాపక శాఖ అధికారులతో కలిసి ప్రమాదానికి గల కచ్చితమైన కారణాలపై దర్యాప్తు చేస్తున్నారు

# భూ హక్కులకు భరోసా పారదర్శకంగా రీ సర్వే

**-రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా బాల వీరాంజనేయ స్వామి.**





**జరుగుమల్లి,ఒంగోలు, ప్రకాశం బ్యూరో, జర్నలిస్ట్ డైరీ :** జరుగుమల్లి మండల కేంద్రంలో నిర్వహించిన “మీ భూమి – మీ హక్కు” కార్యక్రమంలో రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా బాల వీరాంజనేయస్వామి గారు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా లబ్ధిదారులకు నూతన పట్టాదారు పాసుపుస్తకాలను ఆయన స్వయంగా పంపిణీ చేశారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ, గత ప్రభుత్వంలో జరిగిన రీ సర్వే తప్పుల తడకగా మారిందని, సరిహద్దుల వివాదాలతో అనేకమంది లబ్ధిదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారని పేర్కొన్నారు. రీ సర్వే పొలాలకు సంబంధించి తమ భూములకు తప్పుగా హద్దులు పడ్డాయని ప్రజలు తెచ్చిన ఫిర్యాదులపై మంత్రి తక్షణమే స్పందిస్తూ, గతంలో జరిగిన పొరపాట్లన్నింటినీ సరిదిద్ది లబ్ధిదారులకు న్యాయం చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రస్తుతం ఎలాంటి తప్పులకు తావులేకుండా పారదర్శకంగా రీ సర్వే ప్రక్రియను వేగవంతం చేశామని, 2027 మార్చి నాటికి రాష్ట్రవ్యాప్తంగా రీ సర్వేను పూర్తి చేయాలనే దృఢ సంకల్పంతో ముఖ్యమంత్రి ఉన్నారని స్పష్టం చేశారు. రైతుల సౌకర్యార్థం ప్రతి నెలా 9వ తేదీలోపు అర్హులైన ప్రతి ఒక్కరికీ కొత్త పాసుపుస్తకాలు అందజేస్తున్నట్లు వెల్లడించారు.

?పాసుపుస్తకాల పంపిణీకి సంబంధించిన ఖచ్చితమైన గణాంకాలను మంత్రి ఈ సందర్భంగా వెల్లడించారు.

**ప్రకాశం జిల్లా వ్యాప్తంగా మొత్తం 516 గ్రామాలు**

ప్రకాశం జిల్లా వ్యాప్తంగా మొత్తం 516 గ్రామాలు ఉండగా, అందులో 19 గ్రామాలు ముంపు మరియు పట్టణ ప్రాంత పరిధిలోకి వస్తాయని, మిగిలిన 497 గ్రామాలు రీ సర్వేకు అనుకూలంగా ఉన్నాయని వివరించారు. ఇప్పటికే జిల్లాలో 287 గ్రామాల్లో రీ సర్వే పూర్తయిందని, మిగిలిన 210 గ్రామాల్లో సర్వే ప్రక్రియ కొనసాగుతోందని తెలిపారు. గత ఆగస్టు మాసం నాటికి జిల్లా వ్యాప్తంగా 201 గ్రామాల్లో మొత్తం 94,676 పట్టాదారు పాసుపుస్తకాలను పంపిణీ చేశామని పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో మిగిలిన 294 గ్రామాలకు సంబంధించి 3,03,558 పాసుపుస్తకాలను అందించేందుకు ప్రణాళిక సిద్ధం చేశామని, సెప్టెంబరు 2026 నాటికి 23 గ్రామాల్లో 13,356 పుస్తకాలు, అక్టోబరులో 49 గ్రామాల్లో 37,894, నవంబరులో 43 గ్రామాల్లో 35,174, డిసెంబరులో 46 గ్రామాల్లో 52,660, జనవరి 2027 నాటికి 43 గ్రామాల్లో 52,624, ఫిబ్రవరిలో 47 గ్రామాల్లో 58,823 మరియు మార్చి 2027 నాటికి మిగిలిన 43 గ్రామాల్లో 51,107 పాసుపుస్తకాలను అందజేసి రీ సర్వే ప్రక్రియను సంపూర్ణంగా పూర్తి చేస్తామని వివరించారు.

**కొండేపి అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో**

ఆగస్టు మాసం నాటికి మొత్తం 18,020 పాసుపుస్తకాలను అందించినట్లు తెలిపారు. ఇందులో కొండేపి మండలంలో 2,999, మర్రిపూడిలో 831, పొన్నలూరులో 2,049, సింగరాయకొండలో 2,329, టంగుటూరులో 5,645, మరియు జరుగుమల్లి మండలంలో 4,167 పాసుపుస్తకాలు పంపిణీ అయ్యాయని తెలిపారు. ఇక జరుగుమల్లి మండల పరిధిలోని తుమాడు (392), చిరికూరపాడు (606), కామేపల్లి అగ్రహారం (120), పి.ఎమ్.కండ్రిక (46), ఎన్.ఎమ్.వి.కండ్రిక (59), నందనవనం (764), పి.జి.కండ్రిక (148), ఎడ్లూరుపాడు (694), పైడిపాడు (252), పాలేటిపాడు (879), పి.ఎమ్.వి.కండ్రిక (139), ఐఎమ్‌వి కండ్రిక (68), జరుగుమల్లి (854), మరియు జె.జి.కండ్రిక (93) గ్రామాలలో కలిపి మొత్తం 5,114 పాసుపుస్తకాలను లబ్ధిదారులకు అందించినట్లు వెల్లడించారు.

**గతంలో పాలకులు పాసు పుస్తకాలపై తమ సొంత ఫోటోలు వేసుకుని ప్రచారం**

సాంకేతిక పరిజ్ఞానం వినియోగంపై మాట్లాడుతూ గతంలో పాలకులు హద్దురాళ్ల మరియు పాసుపుస్తకాలపై తమ సొంత ఫోటోలు వేసుకుని ప్రచారం చేసుకున్నారని, కానీ ప్రస్తుత ప్రభుత్వం అధికారిక రాజముద్రతో కూడిన భద్రమైన పాసుపుస్తకాలను ప్రజలకు అందిస్తోందని తెలిపారు. భవిష్యత్తులో భూ హద్దులను ఎవరూ అక్రమంగా మార్చడానికి వీలులేకుండా బ్లాక్‌చైన్ టెక్నాలజీని వినియోగిస్తున్నామని చెప్పారు. అంతేకాకుండా, పాసు పుస్తకాలలో ఏర్పాటు చేసిన అత్యాధునిక క్యూఆర్ కోడ్ టెక్నాలజీ ద్వారా ఒక స్కాన్ చేస్తే లబ్ధిదారుల వివరాలు, మరొక స్కాన్ చేస్తే భూమి యొక్క ఖచ్చితమైన లొకేషన్ తెలిసేలా ఏర్పాట్లు చేశామని వివరించారు.

**దీర్ఘకాలిక భూ సమస్యల పరిష్కారంపై స్పందిస్తూ,**

గర్భ కండ్రిక భూముల విషయంలో ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ వహించి దాదాపు 4,000 ఎకరాలకు విముక్తి కలిగించిందని మంత్రి తెలిపారు. అదేవిధంగా చుక్కల భూములు, గయాలు, జాయింట్ ఎల్పీల వంటి సమస్యలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని, త్వరలోనే వీటన్నింటికీ శాశ్వత పరిష్కారం చూపుతామని హామీ ఇచ్చారు.

**అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తున్న ప్రభుత్వం,**

రాష్ట్రంలో ఎన్ని ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ వెలుగొండ ప్రాజెక్టును పూర్తి చేసిందని గర్వంగా ప్రకటించారు. పాలేరు రిజర్వాయర్‌కు 0.6 టీఎంసీల నీటిని కేటాయించడమే కాకుండా, 123 కోట్ల రూపాయల అంచనా వ్యయంతో సంగమేశ్వరం ప్రాజెక్టును మంజూరు చేశామని, త్వరలోనే దీనికి సంబంధించిన నిర్మాణ పనులు ప్రారంభమవుతాయని వెల్లడించారు.

**రాష్ట్రంలో సంక్షేమ రంగానికి అత్యున్నత ప్రాధాన్యత..**

అన్ని రకాల పింఛన్ల పెంపుతో పాటు అన్నదాత సుఖీభవ, తల్లికి వందనం, అన్నా క్యాంటీన్లు, స్త్రీ శక్తి, దివ్యాంగ శక్తి వంటి పథకాల ద్వారా సమాజంలో ప్రతి వర్గానికి సంక్షేమ ఫలాలను తక్షణమే అందిస్తున్నామని పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా అధ్వానంగా ఉన్న రోడ్ల పునర్నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయని తెలిపారు. డిజిటల్ పాలనలో భాగంగా 'మన మిత్ర' యాప్ ద్వారా 100కు పైగా ప్రభుత్వ ధృవీకరణ పత్రాలను పారదర్శకంగా అందిస్తున్నామని, అలాగే 'డిజిలాకర్' ద్వారా లభించే సేవలపై ప్రజలందరూ అవగాహన పెంచుకుని వినియోగించుకోవాలని కోరారు.

ఈ కార్యక్రమంలో మండల స్పెషల్ ఆఫీసర్ రవి, ఆర్డీవో చంద్రశేఖర్ నాయుడు స్థానిక ప్రజాప్రతినిధులు, రెవెన్యూ అధికారులు, వివిధ శాఖల అధికారులు మరియు పెద్ద సంఖ్యలో రైతులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

# నిదానపల్లిలో అంబరాన్నంటిన బోనాల సంబురాలు





**రామన్నపేట, సెప్టెంబర్06 (నేటి దర్శిని ప్రతినిధి):** డప్పుల మోత.. యువత నృత్యాలు.. మహిళల బోనాల ఊరేగింపుతో నిదానపల్లి పల్లె పండుగ శోభను సంతరించుకుంది. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే ఆషాఢ బోనాల జాతర యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండలం నిదానపల్లి గ్రామంలో ఆదివారం అంగరంగ వైభవంగా జరిగింది. ముత్యాలమ్మ తల్లికి గ్రామస్థులు భక్తిశ్రద్ధలతో బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. తొలుత గ్రామపంచాయతీ నుంచి సర్కారు బోనాన్ని కోట మైసమ్మ తల్లికి సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మహిళలు బోనాలతో తరలిరాగా.. యువకులు ఆటపాటలు, నృత్యాలతో సందడి చేశారు. డప్పుల మోతల మధ్య సాగిన ఊరేగింపు ఆకట్టుకుంది. చిన్నారులు, యువత ఉత్సాహంగా పాల్గొనడంతో గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. అమ్మవారి ఆశీస్సులతో గ్రామం సుభిక్షంగా ఉండాలని.. ప్రజలంతా సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో జీవించాలని భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. బోనాల ముగింపు వేడుకలకు గ్రామస్థులు పెద్ద సంఖ్యలో తరలిరావడంతో నిదానపల్లి సందడిగా మారింది.

# టోల్‌గేట్ వద్ద వాహనదారుల నుంచి అక్రమ వసూళ్లు.. నెల్లూరులో రవాణా అధికారి అరెస్ట్

**-నెల్లూరు జిల్లాలో రవాణా శాఖ అధికారులపై ఏసీబీ ఆకస్మిక దాడులు**

**-లంచాలు వసూలు చేస్తున్న ఎంవీఐ, ఇద్దరు హోంగార్డులు పట్టివేత**

**-కారులో దాచిన రూ.1.80 లక్షలతో సహా సుమారు రూ. 2.5 లక్షల నగదు స్వాధీనం**

**-రాష్ట్రంలో రవాణా శాఖ అవినీతిపై తరచూ వస్తున్న ఫిర్యాదులు**

**-అవినీతిపై ఫిర్యాదు చేయాలంటూ ప్రజలకు ఏసీబీ విజ్ఞప్తి**





**నెల్లూరు, జిల్లా బ్యూరో,జర్నలిస్ట్ డైరీ :** ఏపీలో రవాణా శాఖలో అవినీతి మరోసారి బట్టబయలైంది. వాహనదారుల నుంచి అక్రమంగా డబ్బులు వసూలు చేస్తున్న అధికారులపై అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు మెరుపుదాడులు నిర్వహించారు. శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలో జరిపిన ఈ ఆకస్మిక తనిఖీల్లో సుమారు రూ. 2.5 లక్షలకు పైగా లెక్కల్లో చూపని నగదును స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనలో ఓ మోటారు వాహన తనిఖీ అధికారి (ఎంవీఐ)ని అదుపులోకి తీసుకున్నారు.

వివరాల్లోకి వెళితే.. గత ( శనివారం )అర్థరాత్రి తర్వాత రాత్రి నెల్లూరు జిల్లా కావలి సమీపంలోని జాతీయ రహదారి-16పై ఉన్న ముసునూరు టోల్‌ప్లాజా వద్ద రవాణా శాఖ అధికారులు వాహనదారుల నుంచి అక్రమంగా డబ్బులు వసూలు చేస్తున్నట్లు ఏసీబీకి పక్కా సమాచారం అందింది.

**ఏసీబీ అధికారుల ఆకస్మిక దాడి**

దీంతో ఏసీబీ అధికారులు ఆకస్మికంగా దాడి చేశారు. ఈ తనిఖీల్లో జిల్లా ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగంలో ఎంవీఐగా పనిచేస్తున్న బానావత్ గోపీ నాయక్.. ఇద్దరు హోంగార్డులు, ఒక ప్రైవేట్ డ్రైవర్ సాయంతో లంచాలు స్వీకరిస్తున్నట్లు గుర్తించారు.తనిఖీల సమయంలో రోడ్డు పక్కన పడి ఉన్న రూ. 68,800 నగదును అధికారులు గుర్తించారు. అనంతరం ఎంవీఐ గోపీ నాయక్ ప్రయాణిస్తున్న కియా సెల్టోస్ కారును సోదా చేయగా, డిక్కీలో దాచిపెట్టిన రూ. 1,80,000 నగదు బయటపడింది. ఈ మొత్తం రూ. 2,48,800కు ఎలాంటి లెక్కలు లేకపోవడంతో అక్రమ వసూళ్లకు సంబంధించినదిగా భావిస్తూ ఏసీబీ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. దీనిపై తదుపరి విచారణ నిమిత్తం కేసు నమోదు చేశారు.

**ఏఎంవీఐ' లోకనాథ ప్రసాద్ ఏసీబీ కేసు నమోదు**

రాష్ట్రవ్యాప్తంగా రవాణా శాఖ అధికారులపై లంచాల ఆరోపణలు తరచూ వస్తున్న నేపథ్యంలో ఈ ఘటన ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ ఏడాది మార్చి నెలలో కూడా ఆదాయానికి మించి ఆస్తులు కూడబెట్టారన్న ఆరోపణలపై మచిలీపట్నంలో ఏఎంవీఐగా పనిచేస్తున్న లోకనాథ ప్రసాద్‌పై ఏసీబీ కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే.

**అవినీతి పై మాకు సమాచారం ఇవ్వండి**

ప్రభుత్వ శాఖల్లో ఎక్కడైనా అవినీతి, లంచాల బెడద ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని ఏసీబీ అధికారులు ప్రజలను కోరారు. టోల్ ఫ్రీ నంబర్ 1064 లేదా మొబైల్ నంబర్ 94404 40057 ద్వారా ఫిర్యాదు చేయవచ్చని, ఫిర్యాదుదారుల వివరాలను గోప్యంగా ఉంచుతామని స్పష్టం చేశారు.

# నూతన గృహప్రవేశ కార్యక్రమంలో పాల్గొన్న సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి

**ఆమనగల్, సెప్టెంబర్ 06 జర్నలిస్ట్ డైరీ :** రంగారెడ్డి జిల్లా ఆమనగల్లు మండల పరిధిలోని దయ్యాల బోర్డు తాండాలో ఆదివారం నూతన గృహప్రవేశ కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, టాస్క్ సి ఓ ఓ, ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ సుంకి రెడ్డి రాఘవేందర్ రెడ్డి హాజరయ్యారు.యువజన కాంగ్రెస్ నాయకులు నేనావత్ నవీన్ నాయక్ నూతన గృహాన్ని సందర్శించి, ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొని నవీన్ నాయక్ మరియు వారి కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేశారు.



## హాటుగా అదరగొట్టిన ప్రియాంక మోహన్..



# రెండు రోజుల్లోనే రూ. 50 కోట్లు..

### -బాక్సాఫీస్ వద్ద దూసుకుపోతున్న 'మీర్జాపూర్ ది మూవీ'




ప్రముఖ వెబ్ సిరీస్ ఆధారంగా తెరకెక్కిన 'మీర్జాపూర్ ది మూవీ' బాక్సాఫీస్ వద్ద అద్భుతమైన వసూళ్లతో దూసుకుపోతోంది. తొలి రోజు మంచి ఓపెనింగ్స్ రాబట్టిన ఈ చిత్రం, రెండో రోజు కూడా అదే హవాను కొనసాగించింది. ట్రేడ్ వర్గాల సమాచారం ప్రకారం.. ఈ సినిమా రెండో రోజు దేశీయ మార్కెట్లో రూ. 31 కోట్ల నెట్ వసూళ్లను సాధించింది. దీంతో రెండు రోజుల్లో భారత్‌లో దీని మొత్తం నెట్ కలెక్షన్లు రూ. 56.75 కోట్లకు చేరాయి. కాగా.. కేవలం రెండు రోజుల్లోనే ఈ చిత్రం రూ. 50 కోట్ల మైలురాయిని దాటడం విశేషం. దీని ద్వారా దేశీయ గ్రాస్ వసూళ్లు రూ. 68.20 కోట్లకు చేరుకున్నాయి.ఓవర్సీస్ మార్కెట్‌లోనూ ఈ చిత్రానికి మంచి స్పందన లభిస్తోంది. రెండో రోజు విదేశాల్లో రూ. 6 కోట్లు రాబట్టడంతో, ఓవర్సీస్ గ్రాస్ మొత్తం రూ. 10.25 కోట్లకు చేరింది. ఫలితంగా ప్రపంచవ్యాప్తంగా ఈ సినిమా తొలి రెండు రోజుల్లోనే రూ. 78.45 కోట్ల గ్రాస్ కలెక్షన్లను సాధించి, రూ. 80 కోట్ల మార్కుకు చేరువయింది. గుర్‌మీత్ సింగ్ దర్శకత్వం వహించిన ఈ చిత్రానికి ప్రేక్షకులు మరియు విమర్శకుల నుండి పాజిటివ్ రివ్యూలు వస్తుండటంతో థియేటర్లలోకి జనం భారీగా తరలివస్తున్నారు. ప్రస్తుతం బాక్సాఫీస్ 'టాక్సిక్', 'హనుమాన్ అంశ్' సినిమాలతో పాటు అర్షద్ వార్సి 'జీవన్ భీమా యోజన' చిత్రాలతో మీర్జాపూర్ పోటీపడుతోంది.

# ఎన్టీఆర్ సినిమాలో అదిరిపోయే స్పెషల్ సాంగ్..

### - భారీ సెట్‌లో ఇద్దరు హీరోయిన్లతో మాస్ ట్రీట్!





యంగ్ టైగర్ ఎన్టీఆర్, దర్శకుడు ప్రశాంత్ నీల్ కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న సినిమాపై అంచనాలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. 'డ్రాగన్' లేదా 'బ్రూస్ లీ' అనే వర్కింగ్ టైటిల్స్‌తో ప్రచారంలో ఉన్న ఈ సినిమా ఇప్పటికే భారీ హైప్‌ను సొంతం చేసుకుంది. 'కేజీఎఫ్', 'సలార్' వంటి సినిమాలతో తనదైన యాక్షన్ బ్రాండ్‌ను క్రియేట్ చేసుకున్న ప్రశాంత్ నీల్.. ఎన్టీఆర్‌ను ఎలా చూపించబోతున్నారనే ఆసక్తి అభిమానుల్లో నెలకొంది.ఇక ఈ సినిమాకు సంబంధించి తాజాగా ఓ క్రేజీ అప్‌డేట్ ఇండస్ట్రీ వర్గాల్లో వైరల్ అవుతోంది. సినిమా కోసం ఓ భారీ స్పెషల్ సాంగ్‌ను చిత్రీకరించేందుకు మేకర్స్ ప్లాన్ చేస్తున్నట్లు సమాచారం. ఈ పాట కోసం ప్రత్యేకంగా భారీ సెట్‌ను నిర్మిస్తున్నట్లు తెలుస్తోంది ప్రశాంత్ నీల్ సినిమాల్లో యాక్షన్ సన్నివేశాలతో పాటు భారీ విజువల్స్‌కు కూడా ప్రత్యేక స్థానం ఉంటుంది. అదే తరహాలో ఎన్టీఆర్ సినిమాకు కూడా ఆయన స్పెషల్ సాంగ్‌ను భారీ స్థాయిలో డిజైన్ చేస్తున్నట్లు టాక్.ఈ పాట కోసం ప్రత్యేకంగా భారీ సెట్‌ను సిద్ధం చేస్తున్నారని తెలుస్తోంది. పాటలో కనిపించే విజువల్స్ ప్రేక్షకులకు థియేటర్‌లో మాస్ ట్రీట్ ఇచ్చే విధంగా ఉండబోతున్నాయని సినీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది.సినిమా కథ, యాక్షన్‌తో పాటు ఈ పాట కూడా హైలైట్‌గా నిలిచేలా ప్రశాంత్ నీల్ ప్లాన్ చేస్తున్నట్లు సమాచారం. ఈ స్పెషల్ సాంగ్‌లో ఎన్టీఆర్‌తో పాటు సినిమాలో కథానాయికలుగా నటిస్తున్న రుక్మిణీ వసంత్, మరో హీరోయిన్ కూడా కలిసి స్టెప్పులు వేయనున్నట్లు టాక్ వినిపిస్తోంది. ఎన్టీఆర్‌కు మాస్ డ్యాన్స్‌లో ఉన్న క్రేజ్ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. దీంతో ప్రశాంత్ నీల్ మార్క్ మాస్ మేకింగ్‌కు ఎన్టీఆర్ డ్యాన్స్ జోడైతే ఈ పాట అభిమానులకు పండుగలా ఉంటుందని ఫ్యాన్స్ భావిస్తున్నారు.ముఖ్యంగా భారీ సెట్స్, గ్రాండ్ కొరియోగ్రఫీ, స్టార్ హీరోతో పాటు ఇద్దరు హీరోయిన్ల పెర్ఫార్మెన్స్‌తో ఈ సాంగ్‌ను ప్రత్యేక ఆకర్షణగా తీర్చిదిద్దుతున్నట్లు సమాచారం.ఎన్టీఆర్--ప్రశాంత్ నీల్ కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న ఈ చిత్రం మాస్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా రూపొందుతున్నట్లు ఇప్పటికే ప్రచారం జరుగుతోంది. ప్రశాంత్ నీల్ తన సినిమాల్లో యాక్షన్ సీక్వెన్స్‌లను అత్యంత భారీ స్థాయిలో తెరకెక్కిస్తారనే విషయం తెలిసిందే. ఈసారి ఎన్టీఆర్ ఇమేజ్‌కు తగ్గట్టుగా యాక్షన్‌ను మరింత పవర్‌ఫుల్‌గా డిజైన్ చేస్తున్నట్లు తెలుస్తోంది. కథలోని యాక్షన్ ఎపిసోడ్స్, హీరో క్యారెక్టరైజేషన్, భారీ సెట్స్ సినిమాకు ప్రధాన బలాలుగా నిలుస్తాయని ఇండస్ట్రీ వర్గాల్లో టాక్.

# ఆడపిల్లలంటే ఆట వస్తువులు కాదు..

### -అలా చూపిస్తే ఒప్పుకోను..!
### -కాయదు లోహర్ షాకింగ్ కామెంట్స్


ప్రదీప్ రంగనాథన్ నటించిన 'డ్రాగన్' చిత్రంతో హీరోయిన్ కయాదు లోహర్ మంచి గుర్తింపు తెచ్చుకుంది. అంతకు ముందుకు ఈ అమ్మడు తెలుగులో అల్లూరి అనే సినిమా చేసింది. కానీ ఆ సినిమా పెద్దగా ఆకట్టుకుకోలేదు. ఇక ఈ చిన్నది ఫంకీ సినిమాతో మరోసారి తెలుగు ఆడియన్స్ ను ఆకట్టుకుంది. కానీ ఈ సినిమా అంతగా ఆకట్టుకోలేదు. ప్రస్తుతం ఆమె తమిళం, తెలుగు చిత్రసీమలలో చాలా బిజీగా ఉంది. సోషల్ మీడియాలోనూ ఈ ముద్దుగుమ్మ చాలా యాక్టివ్ గా ఉంటుంది. మరోవైపు తెలుగులోనూ బ్యాక్ టూ బ్యాక్ అవకాశాలు అందుకుంటుంది. ప్రస్తుతం నేచురల్ స్టార్ నాని నటిస్తున్న ది ప్యారడైజ్ సినిమాలో కాయదు హీరోయిన్ గా నటిస్తుంది. ఇదిలా ఉంటే తాజాగా కయాదు లోహర్ చేసిన కొన్ని కామెంట్స్ సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతున్నాయి. సినిమాల్లో ఆడవాళ్లను చూపించే విధానంపై కయాదు లోహర్ ఆసక్తికర కామెంట్స్ చేశారు.సినిమాల్లో మహిళలను కేవలం ప్రేక్షకుల దృష్టిని ఆకర్షించే ఐటెమ్ లా చూపించే ధోరణిని తాను ఒప్పుకోనని తేల్చి చెప్పింది కాయదు. స్పష్టం చేశారు యంగ్ హీరోయిన్ కయాదు లోహర్. కథ, పాత్ర డిమాండ్ చేస్తే పరిమితులకు లోబడి నటించడానికి ఎలాంటి అభ్యంతరం లేదని, కేవలం లైమ్ లైట్ కోసమో లేదా సోషల్ మీడియాలో ట్రెండ్ అవ్వడానికో అసభ్యకరమైన సన్నివేశాల్లో నటించే ఆలోచన తనకు అస్సలు లేదని చెప్పుకొచ్చింది కయాదు లోహర్. ఈ కామెంట్స్ ఇప్పుడు సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతున్నాయి. అస్సాంలో పుట్టి పెరిగినా దక్షిణాది సినిమా ఇండస్ట్రీలో సత్తా చాటుతోంది కాయదు లోహర్. తన అందం, అభినయంతో కుర్రకారులో క్రేజ్ తెచ్చుకుందీ ముద్దుగుమ్మ. మోడలింగ్ తో కెరీర్ మొదలు పెట్టిన కాయదు లోహర్. 'టైమ్స్ ఫ్రెష్ ఫేస్' పోటీల్లో విజేతగా నిలిచి అందరి దృష్టినీ ఆకర్షించిన కయాదు ఆ తర్వాత నటనారంగం వైపు అడుగులు వేశారు. కన్నడలో 'ముగిల్‌పేటే' చిత్రంతో కెరీర్ ప్రారంభించింది ఈ ముద్దుగుమ్మ..

# 'ఇరుముడి' నుంచి 'కార్తీకమాసం' వీడియో సాంగ్ విడుదల!




మాస్ మహారాజా రవితేజ హీరోగా, శివ నిర్వాణ దర్శకత్వంలో తెరకెక్కిన బ్లాక్‌బస్టర్ చిత్రం 'ఇరుముడి' నుంచి మరో క్రేజీ పాట విడుదలైంది. ఇప్పటికే "మల్లెపూల పల్లకి" వీడియో సాంగ్‌ను విడుదల చేసిన మేకర్స్ తాజాగా మరో పాటను వదిలారు. అయ్యప్ప స్వామి భక్తి దీక్ష విశిష్టతను, ఆధ్యాత్మిక పరివర్తనను అత్యంత హృద్యంగా ఆవిష్కరిస్తూ రూపొందించిన 'కార్తీకమాసం..' అంటూ సాగే పూర్తి వీడియో గీతాన్ని చిత్ర యూనిట్ తాజాగా విడుదల చేసింది. ప్రస్తుతం ఈ పాట సోషల్ మీడియాలో ఆధ్యాత్మిక ప్రియులను, ప్రేక్షకులను విపరీతంగా ఆకట్టుకుంటోంది.ఈ చిత్రంలో రవితేజ పాత్రలో వచ్చే భావోద్వేగాలు, జీవితంలో అలవాటైన చెడు వ్యసనాలను పూర్తిగా మానుకొని, కఠినమైన అయ్యప్ప దీక్షను భక్తిశ్రద్ధలతో ఎలా కొనసాగించారనే పట్టుదలను ఈ పాటలో దర్శకుడు చాలా చక్కగా చూపించారు. ఒక వ్యక్తి తన అంతరాత్మతో పోరాడుతూ ఆధ్యాత్మిక మార్గం వైపు అడుగులు వేసే ప్రయాణానికి ఈ పాట అద్దం పడుతోంది. సినిమాలోని కథాబలానికి ఈ గీతం ప్రధాన ఆకర్షణగా నిలవనుందని తాజా వీడియో చూస్తే స్పష్టమవుతోంది. సంగీత దర్శకుడు జీవీ ప్రకాశ్‌కుమార్ అందించిన బాణీలు ఈ పాటకు ప్రాణం పోశాయి. హృదయానికి హత్తుకునేలా ఉన్న ట్యూన్స్‌తో పాటు, ఈ పాటకు స్వయంగా దర్శకుడు శివ నిర్వాణ అందించిన సాహిత్యం మరో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. భక్తి భావాలతో పాటు జీవిత సత్యాలను ప్రతిబింబించేలా ఉన్న ఈ పదాలు శ్రోతలను మంత్రముగ్ధులను చేస్తున్నాయి. రవితేజ నటన, జీవీ ప్రకాష్ సంగీతం, శివ నిర్వాణ సాహిత్యం–దర్శకత్వం అన్నీ కలిసి ఈ పాన్ని ఒక మ్యూజికల్ మాస్టర్‌పీస్‌గా మలిచాయి

# డిసెంబర్‌లో లెగసీ



విశ్వక్‌సేన్ కథానాయకుడిగా నటిస్తున్న పొలిటికల్ యాక్షన్ డ్రామా 'లెగసీ'చిత్రాన్ని డిసెంబర్ 4న విడుదల చేయబోతున్నట్లు మేకర్స్ తెలిపారు. సాయికిరణ్ రెడ్డి దైదా దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని కలాహి మీడియా సంస్థ నిర్మిస్తున్నది. ఏక్తా రాథోడ్ కథానాయికగా నటిస్తున్నది.శనివారం రిలీజ్ డేట్‌ను ప్రకటిస్తూ కొత్త పోస్టర్‌ను ఆవిష్కరించారు. అధికారం, కుటుంబం, ప్రేమ, ద్రోహం వంటి అంశాల నేపథ్యంలో ఇంటెన్స్ పొలిటికల్ థ్రిల్లర్‌గా ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నామని మేకర్స్ తెలిపారు. ఈ చిత్రానికి సంగీతం: గోవింద్ వసంత, నిర్మాతలు: యశ్వంత్ దగ్గుమాటి, సాయికిరణ్ రెడ్డి దైదా.

Printed, Published and Owned by SITARALLA SRIRAMULU and Printed at M/s SRI DIVYA PRINTERS, Plot No. 33 & 34, 2nd Floor, Vasthu Colony, LB Nagar, Ranga Reddy, Telangana - 500074 and Published at H.No. 10-1-101/10. Bhagya Nagar Colony, Lingojiguda, Saroornagar, Ranga Reddy, Telangana - 500035. EDITOR: SITARALLA SRIRAMULU , RNI. No. TELTEL/2015/62524. Cell: 9966443465